ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 2 మార్చి 2025



సోలార్ అధికారులు స్వాధీనం చేసుకున్న సాగు భూమి

సూర్యప్రభ వాహనంపై
వీరభద్రుడి చిద్విలాసం

● రాత్రి నంది వాహనంపై ఊరేగింపు ● వైభవంగా బ్రహ్మోత్సవాలు



పీఠాధిపతి ఊరేగింపునకు హాజరైన భక్తజనం



నంది వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రుడు


రాయచోటిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఏడవ రోజు శనివారం ఉదయం ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల బృందంచే వేదమంత్రోచ్ఛారణల మధ్య వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ సమేత వీరభద్రుడు సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు చుట్టుపక్క ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన కోలాటం కార్యక్రమం భక్తులను అలరించింది. అలాగే రాత్రికి ప్రత్యేకంగా అలంకరించబడిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నంది వాహనోత్సవంపై ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయ పీఠాధిపతి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. కాగా ఆదివారం జరగబోయే మహానైవేద్య ఘట్టం సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి బంగారు కిరీట ధారణతో పాటు పట్టువస్త్రాలను ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, గీత దంపతులు సమర్పించారు.

నయవంచన

● పరిహారంలో పరిహాసం
● సోలార్ కోసం బలవంతపు భూసేకరణ
● నష్టపరిహారం కోసం సోలార్ బాధితుల ఆక్రందన



రైతుకు నష్టపరిహారం చెల్లించకుండానే డీకేటీ భూమిలో వేసిన సోలార్ పవర్‌ప్లాంట్



ఎంజాయ్‌మెంట్ భూమిలో సాగుచేస్తున్న వరి

కాడి కట్టి.. మేడి పట్టి.. చెర్నాకోల చేతబట్టి.. ఆరుగాలం శ్రమించి భూములను సాగుచేస్తున్న రైతన్నల జీవితం చీకటిమయమైంది. పుడమి తల్లిని నమ్ముకుని సేద్యం చేయడం తప్ప మరో జీవనాధారం లేని వారి జీవితాలను సోలార్ పవర్ ప్లాంటు రూపంలో బుగ్గి చేసింది. పైసా పరిహారం ఇవ్వకుండానే సోలార్ కోసం బలవంతపు భూసేకరణ చేసి రైతులను కట్టుబట్టలతో సాగనంపేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. రైతులు మాత్రం తమకు పరిహారం చెల్లించాలని, లేకపోతే మరో చోట భూములైనా చూపించాలని, పంటల సాగు తప్ప తమకు వేరే దారి లేదని చెబుతున్నారు.

గాలివీడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూముకుంట, వెలిగల్లు పంచాయతీల్లో 2016 సంవత్సరంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. ఇందులో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కోసం 3150 ఎకరాలు ప్రభుత్వ, ప్రైవేటు, డీకేటీ భూములను అధికారులు సేకరించారు. ఇందులో 500 ఎకరాలు వెలిగల్లు పంచాయతీల్లో పోనూ మిగిలిన 2650 ఎకరాలు తూముకుంట పంచాయతీలో సేకరించారు. ఇందులో 200 ఎకరాలు పాత పట్టా, 350 ఎకరాలు డీకేటీ, 170 ఎకరాలు చుక్కల పట్టా భూములు పోనూ 1930 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. అయితే వీటిలో ఎలాంటి ఆధారం లేకుండా పంటలను సాగు చేసుకుంటూ భూములు కోల్పోయిన రైతులు 200 మంది వరకు ఉన్నారు. ఆనాడు రైతులకు ప్రభుత్వానికి కుదిరిన ఒప్పందం ప్రకారం పాత పట్టాకు రూ.3 లక్షలు, డీకేటీకి రూ.2.64 లక్షలు, ఎలాంటి ఆధారం లేని ఎంజాయ్‌మెంట్ భూమికి రూ.లక్ష ఇచ్చేలా ధరను నిర్ణయించి అటు అధికారులు ఇటు రైతులు గ్రామ పంచాయతీ వారు ఒప్పందంపై సంతకాలు చేసుకున్నట్లు రైతులు పేర్కొన్నారు. అయితే పాత పట్టా రైతులకు పరిహారాన్ని పూర్తిగా చెల్లించి, డీకేటీకి 80 శాతం మాత్రమే చెల్లించి, ఎంజాయ్‌మెంట్ భూమికి ఒక్క రూపాయి కూడా ఆనాడు చెల్లించలేదని వారు పేర్కొంటున్నారు. ఇదికాకుండా నూతనంగా తూముకుంట పంచాయతీలోని దిగువమూల నుంచి తూర్పున ఏటి వరకు పడమర ప్రకాశ్‌నగర్ కాలనీ వరకు 100 మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ 100 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్‌కు 500 ఎకరాలు భూమిని సోలార్ అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వేలు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న నూతన సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణంలో 100 ఎకరాలకు పైగా డీకేటీ భూములు, 120 ఎకరాలకు పైగా ఎంజాయ్‌మెంట్ భూమి కలదని రైతులు పేర్కొన్నారు. డీకేటీ భూములకు పాత రేటు రూ.2.64 లక్షలు, ఎంజాయ్‌మెంట్ భూములకు ఒక్క రూపాయి కూడా ఇవ్వమని సోలార్ అధికారులు తెగేసి చెబుతున్నారని రైతులు తెలిపారు.

50 ఏళ్లుగా రకరకాల పంటల సాగు

నూతన సోలార్ ప్లాంట్ నిర్మాణానికి సేకరిస్తున్న భూముల్లో గత 50 ఏళ్లుగా వివిధ రకాల పంటలను పండిస్తున్నారు. ఈ భూముల్లో నీటి ఆదరణ గల ప్రాంతాల్లో వరి, వేరుశనగ, టమోటా, మిరప, పొద్దుతిరుగుడు సాగు చేస్తుండగా మిగిలిన భూముల్లో కంది, ఉలవ పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూముల్లో సంవత్సరానికి రెండు పంటలను సాగు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ఈ భూములపై వందల మంది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆధారపడి జీవనం సాగిస్తుండేవారమని, 2016లో ఏర్పాటు చేసిన సోలార్ వల్ల తమ పంచాయతీలో 70 శాతం భూములను కోల్పోయామని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ గ్రామం చుట్టూ కనీసం పశువులు మేపుకోవడానికి కూడా స్థలాలు లేవని కృష్ణ, చిన్నప్ప, ఈశ్వరయ్య, అంజి, సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 రోజుల క్రితం తాము సాగు చేసుకుంటున్న భూముల దగ్గరకు సోలార్, రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి భూముల నుంచి వెళ్లిపోండని బెదిరించారని వారు ఆరోపిస్తున్నారు. పక్కనున్న సత్యసాయి జిల్లా నెంబులపూలకుంట మండలంలో 2015లో ఏర్పాటు చేసిన సోలార్ వల్ల ఎంజాయ్‌మెంట్ భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు ఒక్క రైతుకు రూ.లక్ష అందజేశారని, కానీ ఆ మండలానికి కూతవేటు దూరంలో ఉన్న తూముకుంటలో మాత్రం రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదని అధికారులు చెప్పడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీకేటీతో పాటు ఎంజాయ్‌మెంట్ భూ రైతులకు కూడా లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం అందివ్వాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.


డీకేటీకి ఎకరాకు రూ.6 లక్షలు పరిహారం ఇవ్వాలి



2018 పాత సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం వల్ల సర్వే నెంబర్ 818/2లో మూడు ఎకరాల 94 సెంట్లు భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కానీ నా భూమికి సంబంధించి రావాల్సిన రూ.12 లక్షల నష్టపరిహారం ఇంతవరకు ఇవ్వలేదు. కానీ నా భూమిలో సోలార్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకొని వాడుకుంటున్నారు. నాకు రావాల్సిన రూ.12 లక్షలతో పాటు ప్రస్తుతం డీకేటీ భూమికి ఒక ఎకరాకు రూ.6 లక్షల నష్టపరిహారాన్ని ముందుగానే చెల్లించాలని డిమాండ్ చేశారు. మా చేత బలవంతంగా భూములు లాక్కోవడానికి సోలార్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

- ఓర్పు భద్ర, తూముకుంట

భూములపై ఆధారపడి జీవిస్తున్నాం



మేము కేవలం భూములపైన ఆధారపడి జీవిస్తున్నాము. మా కుటుంబానికి ఒకసెంటు డీకేటీ గానీ పాత పట్టా భూములు కానీ లేవు. గత 50 ఏళ్లుగా ఎంజాయ్‌మెంట్ భూముల్లోనే సాగు చేసుకుంటున్నాము. ఎంజాయ్‌మెంట్ భూమికి డీకేటీ పట్టాల కోసం గత 20 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరిగాము. కానీ ఒక్కరూ డీకేటీ పట్టా మంజూరు చేయలేదు. ప్రస్తుతం మా అనుభవంలో ఉన్న భూమి నుంచి వెళ్లిపోండి అని అధికారులు తెలిపారు. ఈ భూములను వదిలితే మేము బతకలేము.

- తవట అంజి, దిగువమూల, తూముకుంట

బలవంతంగా ఎవరూ తీసుకోరు

ప్రస్తుతం నూతనంగా 100 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌కు భూసేకరణ ప్రారంభించాము. ఇప్పటివరకు ప్రభుత్వ భూమిని మాత్రమే సేకరించాము. డీకేటీ భూమిని ఇంతవరకు సేకరించలేదు. డీకేటీ భూములు కలిగిన రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే వారి భూములను స్వాధీనం చేసుకుంటాము. బలవంతంగా ఎవరి వద్ద తీసుకోలేదు. ఎంజాయ్‌మెంట్ కలిగిన రైతుల గురించి ఉన్నతాధికారులకు తెలియజేస్తాము. వారికి కూడా వీలైనంత వరకు ఎక్కడైనా అసైన్‌మెంట్ చేసి ఇవ్వడానికి కృషి చేస్తాము. భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తాము.

- భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

● దర్శనమిచ్చిన నెలవంక



పీలేరులోని జామియా మసీదు

పీలేరు/కలికిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మతంలో ఎంతో ప్రాముఖ్యత, అనంత శుభాలు, ఎన్నో గొప్ప ఆరాధనలు కలిగిన రంజాన్ మాసం రానే వచ్చింది. ఈ సందర్భంగా ఉపవాసాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని పీలేరు ప్రభుత్వ ఖాజీ సయ్యద్ నవాజుద్దీన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నెలవంక దర్శనమిచ్చిందని, ఈ క్రమంలో శనివారం రాత్రి పీలేరులోని అన్ని మసీదుల్లో ఇషా నమాజు తరువాత తరావీహ నమాజులు ప్రారంభమయ్యాయి. పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ముస్లింలు అధికంగా ఉండే పీలేరు, రాయచోటి, మదనపల్లె, బి.కొత్తకోట, ములకల చెరువు, రాజంపేట ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా పీలేరు మల్లెల గ్రౌండ్స్‌లో ఉన్న అక్సా మసీదులో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి అతిఖా షఫీ తన స్వంత నిధులతో ఈ మాసం పూర్తయ్యే వరకు ఉచితంగా సెహరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని వారు, ప్రయాణికులు, నిరుద్యోగులు, అవివాహితులు అక్సా మసీదులో సెహరీ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఉద్యోగులకు గంట వెసులుబాటు

ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ పర్వదిన ఉపవాసాల సందర్భంగా ముస్లిం మతానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ముస్లిం ఉద్యోగులు పనిచేస్తున్న కార్యాలయం చివరి పని వేళలకు గంట ముందే వెళ్లేందుకు అనుమతించింది. ఆదివారం నుంచి ఈ నెల 30వ తేది వరకు ఈ వెసులుబాటు కొనసాగనుంది. ఉపాధ్యాయులతో సహా అన్ని కార్యాలయాల్లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపింది. కాగా అత్యవసర శాఖలకు చెందిన ఉద్యోగులు మాత్రం అవసరమైతే అందుబాటులో వుండాల్సి వుంటుందని ప్రభుత్వం పేర్కొంది.

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరలో
పోటెత్తిన భక్తజనం

● ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

6



రామన్న స్థలాలపై..టీటీడీ నిర్లక్ష్యం..

● దుర్గంధంగా కల్యాణ వేదిక స్థలాలు
● శిథిలావస్థలో పార్వేట మండపం
● గరుడ పుష్కరిణి అభివృద్ధి ఏనాటికి జరిగేనో..?
● భక్తుల ఆవేదన

వివరాలు 6లో..

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో కార్యక్రమ వివరాలపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున జరగబోయే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ, డీఆర్‌డీఏ పీడీ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ రమాదేవి మాట్లాడుతూ మార్చి 1 నుంచి 8 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, కార్యక్రమాల వివరాలు కలెక్టర్‌కు తెలిపారు. బేటీబచావో బేటీపడావో కార్యక్రమంపై ర్యాలీ, ఆడపిల్లలు పుట్టిన సందర్భంగా మొక్కలు నాటడం, బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ, మహిళలపై ఉపాధి అవకాశాలపై అవగాహన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, బీసీ సంక్షేమశాఖ అధికారి సురేశ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను
వైభవంగా నిర్వహిస్తాం

● టీటీడీ ఈవో జె.శ్యామలరావు



రాజంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో జె.శ్యామలరావు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక కోదండరామాలయానికి వచ్చి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీధర్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ నెల 5 నుంచి 9వ తేది వరకు జరగనున్న మహాసంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు నుంచి ఆలయంలో పనులు నిర్వహిస్తున్నామని, ఈ పనులు పూర్తికానున్నాయన్నారు.

ఏప్రిల్ 6 నుంచి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈవో శ్యామలరావు మాట్లాడుతూ ఏప్రిల్ ఆరో తేది నుంచి 15వ తేది వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, 11న సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం పటిష్ట..

(మిగతా 6లో...)

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

● మొదటిరోజు 14,674 మంది హాజరు ● పర్యవేక్షణలో డీఐఈవో కృష్ణయ్య



రాయచోటిలోని ఓ ప్రైవేటు కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు

రాయచోటిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిధిలోని 49 పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 1 నుంచి 20వ తేది వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. ఆయా పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్ పర్యవేక్షణలో అత్యంత పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణపై ఆరాతీశారు. మొదటిరోజు శనివారం 15,539 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గానూ 14,674 మంది పరీక్షకు హాజరు కాగా 865 మంది గైర్హాజరయ్యారు. ఇక ప్రతి పరీక్షా కేంద్రంలో గాలి, వెలుతురు ఉండేలా ఫాన్స్, లైట్స్, మరుగుదొడ్లు, బెంచ్‌లు తదితర మౌలిక వసతులు కల్పించారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు డీఐఈవో కృష్ణయ్య తెలియజేశారు. పరీక్షలకు హాజరయ్యే సిబ్బంది, విద్యార్థులు ఎవరూ కూడా సెల్‌ఫోన్స్ ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి తీసుకొని రావద్దని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని, కేంద్రానికి దగ్గరలోని జిరాక్స్ షాపులు మూసివేయాలన్నారు.



పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద హాల్‌టికెట్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

పీలేరు వాసవీ అమ్మవారిని దర్శించుకుంటున్న దూండి రాకేశ్, తదితరులు



కూటమితో ఆర్యవైశ్యులకు గౌరవం

● ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేశ్

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం ఆర్యవైశ్యులకు చంద్రబాబు ప్రభుత్వం గౌరవం కల్పించిందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేశ్ అన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 'యువగళం' పాదయాత్రలో నారా లోకేశ్‌కు రాష్ట్ర ఆర్యవైశ్యులు చేసిన విజ్ఞప్తిపై స్పందించి అధికారంలోకి వచ్చిన తరువాత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ఆర్యవైశ్యులందరికీ గౌరవం కల్పించినట్లైందన్నారు. అలాగే పొట్టి శ్రీరాములు జయంతిని కూడా అధికారికంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందని, వచ్చే ఏడాది నుంచి ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఆర్యవైశ్య సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ బద్రీనాథ్, పీలేరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బలసా వేణుగోపాల్, సభ్యులు గణపతి, వంశీ, మహేశ్ గుప్తా, నాగరాజ, రేవూరి సుధీర్, జయచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవాలు

మదనపల్లె అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మహాకుంభాభిషేక మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి అమ్మవారి చిత్రపటం, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేష్ హాజరయ్యారు. కన్యకాపరమేశ్వరీ మాతను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, ప్రధాన కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి సూరే గిరిధర్, ఎల్లంపల్లె ప్రశాంత్, ప్రవీణ్, వాసవీ మహిళా సంఘాల సభ్యులు పర్యవేక్షించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు తమ అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పీలేరు డివిజనల్ ఇంజనీరు చంద్రశేఖర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెల్లించాల్సిన రుసుములో 50శాతం రాయితీ కల్పించిందని ఆయన తెలిపారు. 1 కిలోవాట్ అదనపు లోడుకు ఇది వరకు రూ.2250 చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం దానిని రూ.1250లకు కుదించారన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు, ఆధార్ కార్డులతో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట



ఎస్పీ కార్యాలయ ఆవరణలో ప్రేమికులు

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును శనివారం ఓ ప్రేమజంట ఆశ్రయించింది. ఆ వివరాల్లోకి వెళితే.. చిట్వేలి మండల పరిధిలో ఉన్న నగిరిపాడు గొల్లపల్లెకు చెందిన పవన్ కుమార్, మదనపల్లెకు చెందిన శిల్ప ప్రేమించుకున్నామని, తల్లిదండ్రులకు ఈ విషయాన్ని వివరించామని తెలిపారు. అయితే ఇరువురు తల్లిదండ్రులు ఇందుకు అంగీకరించలేదని, దీంతో తాము కడప అంజనేయస్వామి ఆలయంలో వెళ్లి వివాహం చేసుకున్నామన్నారు. దీంతో తమ కుటుంబ సభ్యులు చంపుతామని బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కావాలని పోలీసులకు విన్నవించారు. తాము మేజర్లమని, ఇందుకు సంబంధించిన సర్టిఫికేట్లు ఉన్నాయన్నారు. కాగా శిల్ప తిరుపతిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పవన్‌కుమార్ ఫ్లిప్‌కార్ట్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రామసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మాలేనత్తం పంచాయతీ కుప్పనపల్లెకు చెందిన గంగులప్ప(62) కుదురుచీమనపల్లెలో పనికి వెళ్లి చింతకాయల కోసం చెట్టు ఎక్కాడు. కాయలు కోస్తుండగా చెట్టు కొమ్మలను ఆనుకుని ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్ తగలడంతో మృతి చెందాడు. చెట్టు కింద కాయలు ఏరుతున్న ప్రమీలమ్మపై మృతుడు పడటంతో ఆమెకు కాలు విరిగింది. 108లో ఆమెను ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన గంగులప్పకు ముగ్గురు కూమార్తెలు. చెట్టుకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను సరిచేయకపపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, విద్యుత్ అధికారుల నిర్ల క్ష్యానికి నిదర్శనమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గేదెల మృతి

సంబేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లి గ్రామం ఎర్రగుంట్ల హరిజనవాడ నివాసి అయిన అంజనమ్మకు చెందిన 3 గేదెలు, 3 దూడలు శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాయి. మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన గేదెలు కాళ్ళు బిగుసుకుపోయి ఒక్కసారిగా కింద పడి ప్రాణాలు విడిచినట్లు బాధితురాలు తెలిపారు. ఒకేసారి ఆరు మూగజీవాలు మృతి చెందడంతో ఆమె బోరున విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

రామన్న స్థలాలపై.. టీటీడీ నిర్లక్ష్యం..


వాల్మీకిపురం పట్టాభిరాముడిపై మండల ప్రజలకు భక్తి ఎక్కువ. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కానీ శతాబ్దాల చరిత్ర కలిగిన పట్టాభిరాముడి ఆలయ స్థలాలపై టీటీడీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు వస్తే కానీ ఆయా స్థలాలపై శ్రద్ధ చూపడం లేదు. శిథిలావస్థలో ఉన్న మండపం, గరుడ పుష్కరిణిని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. స్వామివారి చక్రస్నాన ఘట్టం ఒక గంగాళం నీటిలో చేస్తున్నారంటే ఎంతటి నిర్లక్ష్యమో అర్థమవుతోంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి మరమ్మతుల దిశగా చర్యలు తీసుకుంటారని భక్తుల కోరిక.



బ్రహ్మోత్సవాలలో గంగాళంలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు(ఫైల్‌ఫొటో)



- ● దుర్గంధంగా కల్యాణ వేదిక స్థలాలు
- ● శిథిలావస్థలో పార్వేట మండపం
- ● గరుడ పుష్కరిణి అభివృద్ధి ఏనాటికి జరిగేనో..?
- ● భక్తుల ఆవేదన



వాల్మీకిపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉందని పెద్దల మాట. అలాంటి ఆలయం టీటీడీ ఆధీనంలోకి వెళ్లినప్పటి నుంచీ ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాల్లో ఎంతో ప్రాచుర్యం సంతరించుకుంది. ఆలయానికి సంబంధించిన స్థలాలు పలుచోట్ల అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్నాయి. బైపాస్ రోడ్డులో తోటవీధి ప్రాంతంలో ఉన్న టీటీడీ స్థలాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఏటా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇదే ప్రాంతంలో భారీ ఏర్పాట్ల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తుంటారు. వారం రోజుల బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తారు. కల్యాణం అనంతరం ఈ స్థలాలను పట్టించుకోవడం లేదు. మళ్లీ మరుసటి ఏడాది వస్తే కానీ టీటీడీ అధికారులు ఈ స్థలాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. టీటీడీకి సంబంధించిన రెండెకరాలకు పైగా స్థలాలకు గొప్పగా ప్రహరీ, గేట్లు ఏర్పాట్లు చేసినా అన్యాక్రాంతంగా మారిపోతున్నాయి. ఆలయ స్థలాలని తెలిసినా కొందరు దుర్గంధంగా తయారు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 15 ఏళ్లగా స్వామివారి కల్యాణ వేదిక ఏర్పాట్ల ఖర్చు ఇప్పటివరకు చూస్తే రూ.కోటి పైమాటే. కానీ శాశ్వత షెడ్లు నిర్మిస్తే టీటీడీకి ఆదాయం, ఖర్చు కూడా తగ్గుతుంది. అలాగే సీతారాముల కల్యాణం జరిగే ప్రాంతంలో పేద కుటుంబాలు పెళ్లిళ్లు చేసుకునేలా మండపం ఏర్పాటు చేయాలని, ఆ దిశగా టీటీడీ అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఉన్న టీటీడీ స్థలాలను కూడా పట్టించుకోకపోవడం విచారకరం.

శిథిలావస్థలో పార్వేట మండపం

పట్టాభిరామాలయానికి అనుబంధంగా ఉన్న పార్వేట మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. అది నేడోరేపో కూలేందుకు సిద్ధంగా ఉన్నా టీటీడీ ఏమాత్రం పట్టించుకోలేదు. మండపం స్తంభాలపై అనేక శిల్పాలు, దేవుడి బొమ్మలు ఉన్నాయి. ప్రస్తుతం ఫ్లోరింగ్ లేక బండలు ఎక్కడపడితే అక్కడ పడున్నాయి. పైకప్పుపై మట్టి పేరుకుపోయి గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి. చారిత్రక శిల్పకళను కాపాడి పార్వేట మండపం భావితరాలకు ఉపయోగపడేలా టీటీడీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్వం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో చక్రస్నాన ఘట్టాన్ని స్వామివారి గరుడ పుష్కరిణిలో వైభవంగా నిర్వహించేవారు. గడిచిన పదేళ్లలో చక్రస్నాన ఘట్టాన్ని భక్తులు తిలకించలేకపోవడం బాధాకరం. ప్రస్తుతం గంగాళం నీటిలో స్వామివారి చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి కల్యాణ వేదిక స్థలాలు, పార్వేట మండపం, గరుడ పుష్కరిణి అభివృద్ధి పట్ల చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

కల్యాణ వేదిక స్థలాలను పరిశీలించి శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతాం. స్థానికుల అభిప్రాయాల మేరకు ప్రతి విషయం టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పట్టాభిరామాలయ పార్వేట మండపం, గరుడ పుష్కరిణిలో పునరుద్ధరించే దిశగా ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

- కృష్ణమూర్తి, ఈవో, పట్టాభిరామాలయం, వాల్మీకిపురం



దుర్గంధంగా పట్టాభిరాముడి కల్యాణ వేదిక స్థలాలు



శిథిలావస్థకు చేరిన పార్వేట మండపం



నిరుపయోగంగా కోనేటివీధిలోని పట్టాభిరాముడి గరుడ పుష్కరిణి

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు : సబ్ కలెక్టర్



రైతుల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

బి.కొత్తకోట మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించాలని, భూ ఆక్రమణదారులపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఫ్రీహోల్డ్ భూములు, రెవెన్యూ సదస్సు అర్జీలు, భూముల రీసర్వే, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి వీఆర్వోను విడివిడిగా మాట్లాడి ఆయా రెవెన్యూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌పై వివరణ కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూసమస్యలపై 5890 అర్జీలు వచ్చాయని, వాటిలో 4669 పరిష్కారించారన్నారు. బి.కొత్తకోట మండలంలో అత్యధికంగా 1023 అర్జీలు ఇచ్చారని, వాటిలో సరైన ఆధారాలు ఉన్న వాటిని పరిష్కరించి లేనివాటికి ఎండార్స్‌మెంట్ ఇచ్చామన్నారు. హార్సిలీహిల్స్‌లో టౌన్‌షిప్ కమిటీ మీటింగ్ త్వరలో నిర్వహించి అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ భూసమస్యలపై స్థానికులు ఇచ్చిన అర్జీలను తీసుకుని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజారుద్దీన్, ఆర్‌ఐ వీరాంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

నిమ్మనపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చిన వృద్ధురాలు ఓబులమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ముష్టూరు పంచాయతీకి చెందిన ఓబులమ్మ బెంగళూరులో కుమారుడి వద్ద ఉంటోంది. అయితే వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఆమె తన మనవడి కోసం ముష్టూరు క్రాస్ వద్ద వేచి వుంది. ఇంతలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలో ఉన్న 25గ్రాముల బంగారు గొలుసును లాక్కుని మదనపల్లె వైపునకు వెళ్లిపోయారు. గొలుసు విలువ సుమారు రూ.లక్ష 70వేలు వుటుందని, ఆమె కుమారుడు వాసుదేవ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

మదనపల్లె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మదనపల్లె మున్సిపల్ పరిధిలోని సిద్ధమ్మ లేఅవుట్, పీఅండ్‌టీ కాలనీ, సొసైటీ కాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డెప్పకాలనీలలో రూ.1.66 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం శనివారం భూమి పూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చైర్ పర్సన్ మనూజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేణుక, నాయకులు నవీన్‌చౌదరి, భాస్కర్, నాగయ్య, రామకృష్ణ, రమణ, శశికుమార్, రంగస్వామినాయుడు, సహదేవనాయుడు, జాన్‌బాబు, జేసీటీ ఈశ్వర్ నాయుడు, జీవీ నాయుడు, విజయమ్మ, పులి మహాలక్ష్మి, రాధా, జాఫర్‌రున్నిస్సా పద్మమ్మ, మాజీ కౌన్సిలర్ బాబ్జి, జనసేన వీర మహిళ దాదం అనిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేఈవో వీరబ్రహ్మం



ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

● టీటీడీ ఈవో శ్యామలారావు

(5వ పేజీ తరువాయి..)

ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు వచ్చే అవకాశం ఉందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, టీటీడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా వృషభలగ్నంలో ఉదయం 9.30 నుంచి 10.15 గంటల మధ్య ధ్వజారోహనం, సాయంత్రం శేషవాహనం, 7న వేణుగాన అలంకారం, హంస వాహనం, 8న వటపత్రశాయి అలంకారం, సింహవాహనం, 9న నవనీతకృష్ణ అలంకారం, హనుమంత వాహనం, 10న మోహినీ అలంకారం, గరుడసేవ, 11న శివ ధనుర్బాణ అలంకారం, సీతారాముల కల్యాణం (రాత్రి 8.30 గంటలకు), గజవాహనం, 12న రథోత్సవం, 13న కాళీయమర్దన అలంకారం, అశ్వవాహనం, 14న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహనం, 15న రాత్రి పుష్పయాగం ఉంటుందని తెలిపారు.

టీడీపీ నేతల వినతి..

ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఎన్నో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని ఈవోకు ఒంటిమిట్ట టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా గతంలో సీఎం చంద్రబాబునాయుడు రూ.వంద కోట్ల అభివృద్ధి ప్రణాళికను ప్రకటించగా ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. చెరువు కట్టపై ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేయాలని, శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని, అసంపూర్తిగా ఉన్న కల్యాణమండపాన్ని పూర్తి చేయాలని, బోటు షికారు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టీడీపీ బీసీ నేత ఎస్వీ రమణ ఉన్నారు.

శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం

కలకడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం త్రిశూల స్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ఉన్న పుష్కరిణిలో జలాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, వసంతోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, శ్రీనివాసులునాయడు, రెడ్డెప్పనాయుడు, జి.కుమార్‌నాయు డు, మల్లికార్జుననాయుడు, హిమగిరినాయుడు, రైస్‌మిల్ రమణ, నరసింహులు, పుణ్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరులో త్రిశూల స్నానం చేస్తున్న అర్చకులు, భక్తులు

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

- ● ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- ● పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరుణించి కాపాడమ్మా గంగమ్మతల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతరలో భాగంగా శనివారం నిండు తిరుణాళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పుట్టినిల్లు అయిన చాగలగుట్టపల్లె నుంచి తెల్లవారుజామున బయలుదేరి ఉదయం 7గంటలకు గంగమ్మజాతరకు చేరుకోగానే జాతర మొదలైంది. సంప్రదాయబద్ధంగా రోడ్డు రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీసమేతంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే కలెక్టర్ చామకూరి శ్రీధర్ దంపతులు, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా గొల్లపల్లె చెల్లు వంశీయులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పొంగుబాలు సమర్పించారు. అనంతరం ఈడిగపల్లెకు చెందిన ఈడిగ కులస్తులు కల్లు తీర్థం, చౌటపల్లెకు చెందిన రామయ్య కుటుంబీకులు సిద్దలకూడు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి 10గంటలకు ఆలయం చుట్టూ కుంకుమ బండ్లు, చాందినీ బండ్లను రంగురంగుల విద్యుత్ దీపాలంకర ణలతో, బాణాసంచా పేల్చుతూ వైభవంగా ఊరేగించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు, మండల యువజన నాయకుడు యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో 25 ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేశారు. మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, మరుగుదొడ్లు, పారిశుధ్యం తదితర వసతులను ఏర్పాటు చేశారు. అలాగే మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పోలీసుల పర్యవేక్షణ

గంగమ్మజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర చుట్టూ నాలుగు ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు.

ఘనంగా బండలాగుడు పోటీలు

గంగమ్మజాతర సందర్భంగా ఎడ్ల బండలాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాలయ్యగారిపల్లె, ఆలంఖాన్‌పల్లె, గొల్లపల్లె, కుమ్మరికొట్టాలు, తిప్పిరెడ్డిపల్లె, ఓబులంపల్లె, పోతిరెడ్డిపల్లె, ప్రాంతాలకు చెందిన ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.లక్షను శ్రీనివాసగౌడ్, ద్వితీయ బహుమతి రూ.80వేలు మండిపల్లి కుటుంబీకులు, తృతీయ బహుమతి రూ.60వేలను శివప్రసాద్ అందజేశారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి మండిపల్లి



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన జబర్దస్త్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా రేలారే..రేలా జానపద గేయాలు, అనంతరం పంచ్ ప్రసాదు, చలాకీ చంటి, మరికొంత మంది జబర్దస్త్ కళాకారులు భక్తులను కడుపుబ్బ నవ్వించారు. ఆర్కెస్ట్రా కళాకారులు సినిమా పాటలు పాడారు.

'రాష్ట్ర బడ్జెట్ కోతల బడ్జెట్'

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కోతల బడ్జెట్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్-6 హామీలతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, బడ్జెట్‌లో సూపర్-6 హామీలకు మంగళం పాడారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కోసం బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో 83 లక్షల మంది విద్యార్థులు ఉండగా వారికి తల్లికి వందనం పథకానికి కేవలం 9,407 కోట్లు కేటాయించారన్నారు. అన్నదాన సుఖీభవ పథకానికి 10,600 కోట్లు అవసరం కాగా రూ.6,300 కోట్లతో సరిపెట్టారని విమర్శించారు. 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు పింఛన్లు ఇవ్వడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని తెలిపారు. మహిళా శక్తి పథకానికి, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఎటువంటి నిధులు కేటాయించలేదన్నారు. సాగునీటి రంగానికి నాలుగు శాతం నిధులు మాత్రమే కేటాయించారని, దీని వలన ప్రాజెక్టుల నిర్మాణంలో పురోగతి ఉండదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పీఎండీ నజీర్, జిలానీబాష, ఖాజాపీర్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● మార్చి 6 వరకు గడువు



ప్రతిభ ఆధారంగానే సీట్లు

ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు కల్పిస్తాం. జిల్లాలో 13 స్కూళ్లలో 1040 సీట్లు ఉంటాయి. ఇంటర్ రెండు గ్రూపులకు కలిపి 880 సీట్లు ఉంటాయి. అర్హులైన పేద కుటుంబాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-అంపావతి ఉదయశ్రీ,
జిల్లా కోఆర్డినేటర్



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశా లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడి యట్‌లో చేరేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచిత విద్య, భోజనం, వసతి, పుస్తకాలు పొందే అవకాశం ఉంటుంది. అర్హులైన వారు మార్చి 6లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఆయా గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు. జిల్లాలోని 13 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాల, బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలకు ప్రవేశపరీక్షలు నిర్వహి స్తున్నారు. 5వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12గం టల మధ్య ప్రవేశపరీక్ష ఉంటుంది. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు పరీక్ష జరుగు తుంది. ప్రవేశం పొందిన వారికి టెక్స్ట్ బుక్కులు, నోట్‌బుక్కులు ఉచితంగా ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్య పొందే అవకాశం ఉంటుంది.

అర్హులు వీరే... : 5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, బాలబాలికలు 2012 సెప్టెం బరు 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. బీసీ, ఓసీ, బీసీ-సి వర్గాలకు చెంది న విద్యార్థులు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. అదేవిధంగా జూనియర్ ఇంటర్‌కు సబంధించి 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థుల తల్లి దండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉండకూడదు. ఒక్కో పాఠశాలలో 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు గ్రూపులలో 40సీట్ల చొప్పున 80 సీట్లు ఉంటాయి.

పాఠశాలలు, కళాశాలలు ఇవే...

బాలురు : బ్రహ్మంగారిమఠం -12, గండి క్షేత్రం, పులివెందుల, సగిలేరు. **బాలికలు:** చిన్నచౌకు, కమలాపురం, తొండూరు, మడకల వారిపల్లె, రాజుపాలెం, కొండాపురం, పులివెందుల, గుండ్లకుంట.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్



ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

కడప కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం రిజర్వాయర్ల ద్వారా సుస్థిరమైన సురక్షిత తాగునీరు అందించేందుకు తలపెట్టి న ప్రాజెక్టు ప్రణాళికల సన్నద్ధతపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతా లకు ఎలాంటి తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులకు ప్రతిపాదనలను అందజేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తెలుగుగంగ ఆర్-1, బ్రహ్మంసాగర్, మైలవరం, గండికోట, చిత్రావతి రిజర్వాయర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 55 ఎల్‌పీసీడీ (రోజుకు వినియోగించే తలసరినీరు) పట్టణ ప్రాంతాల్లో 135 ఎల్‌పీసీడీ శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా తాగునీటి అవసరాల కు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డ బ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌వీ కన్సల్టెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అబార్షన్లు చేస్తున్న ఆర్‌ఎంపీ గుట్టురట్టు

● ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసిన వైద్యశాఖ అధికారులు

కడప కలెక్టరేట్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తున్న ఆర్‌ఎంపీ గుట్టు రట్టయ్యింది. వైద్యశాఖ డెమో సెక్షన్‌కు సమాచారం అందడంతో శనివారం జిల్లా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో డెమో సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులు చేసి.. అబార్షన్లకు, కాన్పులకు వినియోగిస్తున్న ఇంటిని సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని అక్కాయపల్లెలో ఆర్‌ఎంపీ ప్రభావతి ప్రథమ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తోంది. శనివారం తన ప్రథమ చికిత్స కేంద్రంలో ఓమహిళకు అబార్షన్ చేస్తున్నట్లు డెమో అధికారులు భారతి, రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారీలకు సమాచారం అందింది. వెంటనే సంబంధిత అధికారితో కలిసి ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేసి అబార్షన్ చేయించునేందుకు వచ్చిన మహిళను గుర్తించారు. వెంటనే ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. గుర్తింపు పొందిన గైనకాలజిస్టుల పర్యవేక్షణలో జరగాల్సిన అబార్షన్లను పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను ఉల్లంఘించి ఇంటిలో చేస్తుండటంతో ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకున్నారు. ఇంటిని సీజ్ చేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ పాలేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా వారోత్సవాలు ప్రారంభం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని డి-బ్లాక్ నుంచి భేటి బచావో-భేటి పడావో అనే నినాదంతో బైక్ ర్యాలీని ప్రారంభించారు. జేసీ అదితి సింగ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ 3వ తేదీన బాల్య వివాహాల నిర్మూలన కోసం కొవ్వొత్తుల ర్యాలీ, మండల కార్యాలయాల వద్ద సంతకాల సేకరణ నిర్వహించాలన్నారు. 4వ తేదీన పౌష్టికాహారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 5న కౌమార దశ బాలికలకు కెరీర్ అవకాశాలపై అవగాహన తరగతులు, 6న బ్యాంక్ మేళా, 7న మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమాలు, 8న జిల్లాస్థాయిలో మహిళా, చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన నిర్వహించనున్నట్లు వివరించారు.

నలుగురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లు అరెస్టు

● రూ.5.60 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, పట్టుబడిన బుకీలతో సీఐ లింగప్ప

జమ్మలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం రాత్రి నలుగురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రావులకొల్లు నాగేంద్ర, జమ్మలమడుగు పట్టణానికి చెందిన సకిలిగిరి మాలిక్‌బాష, డి.జమాల్‌బాష, గడ్డం మాలిక్‌లు జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బెట్టింగ్‌కు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఢిల్లీక్యాపిటల్స్ వీఎస్ ముంబై జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను చూస్తూ పై నలుగురు వ్యక్తులు పందెం కాస్తున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5.60 లక్షలు నగదు, నాలుగు ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, బెట్టింగ్ రాయుళ్ల వద్ద భారీగా డబ్బులు పట్టుబడినట్లు జమ్మలమడుగు పట్టణంలో ప్రచారం ఉంది.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

● పొలం తగాదాలే హత్యకు కారణం : డీఎస్పీ

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం దిగువపల్లె గ్రామానికి చెందిన పప్పూరి గంగిరెడ్డి హత్యకు పొలం తగాదాలే కారణం అని డీఎస్పీ మురళీ తెలిపారు. హత్యకేసులో నిందితుడు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ బొర్ర ప్రతాప్‌రెడ్డి (45)ని శనివారం సాయంత్రం 5గంటలకు పులివెందుల రూరల్ ఇన్‌స్పెక్టరు ఎన్‌వీ రమణ అరెస్టు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మీడియా సమావేశంలో తెలిపారు.

దిగువపల్లెకు చెందిన కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి అతని అన్న కేతిరెడ్డి నాగేశ్వ ర్‌రెడ్డికి ఒక్కొక్కరికి 4ఎకరాల 50 సెంట్లు చొప్పున వ్యవసాయ భూమి ఉంది. ప్రతాప్‌రెడ్డి అన్నకు అప్పులు ఉండటంతో సుమారు పదేళ్ల క్రితం అతని 4 ఎకరాల 50 సెంట్లు వ్యవసాయ భూమిని దిగువపల్లెకు చెందిన పప్పూరు గంగిరెడ్డి చిన్నకుమారుడు దామోద ర్‌రెడ్డికి అమ్ముకున్నాడు. దీంతో ప్రతాప్‌రెడ్డి పొలంలో అరటిపంట కోత ఉన్నప్పుడు లారీ వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈవిషయమై పప్పూరి గంగిరెడ్డితో గొడవపడుతూ ఉండేవాడు. ఈ నేప థ్యంలోనే తన అన్న పొలం నుంచి తనకు ఎందుకు దారి ఉండ దంటూ ఫిబ్రవరి 24న పొలం వద్ద గంగిరెడ్డితో ప్రతాప్‌రెడ్డి ఘర్షణ పడి మచ్చు కొడవలితో నరికి చంపాడు. ఈవిషయం నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎన్‌వీ రమణ, లింగాల మండల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలి

● అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

● జిల్లా ఇన్‌చార్జ్ సప్లయర్స్ ఆఫీసరు చంద్రిక



రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న జిల్లా సివిల్ సప్లై అధికారి

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనం ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని.. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా సివిల్ సప్లై అధికారి చంద్రిక అన్నారు. జేసీ అదితి సింగ్ ఆదేశాల మేరకు ఆమె నిత్యావసర సరుకులు పంపిణీని స్థానిక ఆర్డీవో, తహసీ ల్దారులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామం, పులివెందుల పట్టణంలోని వార్డుల్లో శనివారం ఉదయం రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందా లేదా అని ఆరా తీశారు. పంపిణీ చేసేవారికి తగు సూచనలు చేశారు. పట్టణంలో గత రెండు నెలలుగా కందిబేడలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు అడగ్గా ప్రభుత్వం నుంచి షార్టేజీ ఉండడం వల్ల రాలేదని.. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తాయన్నారు. మొత్తం 14 ఎన్‌డీయూ వాహ నాలు ఉండగా... 12 వాహనాల ద్వారానే పంపిణీ జరుగుతుందని.. మిగ లిన రెండు వాహనాలను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. రేషన్ పంపిణీ జరిగే చోట ఎక్కడైనా లబ్ధిదారులు తీసుకోవచ్చు అని.. ప్రతి రేషన్‌షాప్‌లో 1వ తేదీ నుంచి 15 వరకు కచ్చితంగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, తహసీల్దారు మహ్మద్ నజీర్, డిప్యూటీ తహసీల్దారు సుధీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీ నేత పీరయ్య ఆకస్మిక మృతి



కడప మారుతీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ నాయకుడు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మాజీ కౌన్సిల్ మెంబర్ పోతుగంటి పీరయ్య ఆకస్మిక మృతి చెందాడు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పీరయ్య మృతి బాధాకరమని.. పార్టీకి తీరని లోటు అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ అన్నారు. అలాగే పీరయ్య మృతి పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, వీఎస్ అమీర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడిగా, తెలుగు దేశం పార్టీ నాయకుడిగా ఆయన చేసిన కృషి పార్టీ ఎన్న టికీ మరువలేదన్నారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మృతి




జగన్మోహనాచార్యులు (ఫైల్)

సత్యవేడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు (54) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో పరీక్షల ప్రధాన అధికారిగా ఆయన శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులు పూర్తయ్యే సరికి పొద్దుపోయింది. ఇంటికి (తిరుపతికి) వెళ్లకుండా రాత్రి కాలేజీలోనే బసచేశారు. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో స్పృహ కోల్పోయారు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందారు. తిరుపతిలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కళాశాలకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ మరణంతో కళాశాలలో విషాదచాయలు అలుముకున్నాయి. ఆయన స్వస్థలం కడప జిల్లా జమ్మలమడుగు మండలం. 2023లో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మహిళా పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌస్

కడప క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మహిళా పీఎస్‌లో విద్యార్థినులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు మరియు సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్త లపై మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ వివరించారు. పోలీసుస్టేషన్‌లో పోలీసుల విధులు, ఉపయోగించే రికార్డులు, వినియోగించే వస్తువుల గురించి ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థినులకు వివరించారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి ప్రమాదాల్లో చిక్కుకున్నా వెంటనే సహాయం అందించేలా హెల్ప్‌లైన్ నెంబర్లు తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీసు హెల్ప్‌లైన్ 100, 112, సైబర్ క్రైం హెల్ప్ లైన్ 1930లను సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.క్రిష్ణారెడ్డి, ఏహెచ్‌టీ యూ ఇన్‌స్పెక్టర్ జి.ఈదురుబాషా, ఎస్ఐలు శ్రీనివాసులు, శాంత మ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



గోమాతల సేవలో..



మానవసేవే మాధవ సేవ అంటారు.. ఈ సూక్తిని ఆదర్శంగా తీసుకున్నారు కొందరు గో ప్రేమికులు.. ఆకలి దప్పికలతో అలమటిస్తూ.. ఏవి దొరికితే (ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు, ఎముకలు) అవి తింటూ మృత్యు వాత పడుతున్న ఆవులను చూసి చలించిపోయారు. వాటి ఆలనా పాలన కోసం గోశాలలను ఏర్పాటు చేసి.. వాటి సేవలో తరిస్తున్నారు.

● ఆవుల సంరక్షణ కోసం గోశాల ఏర్పాటు



ముక్తిదామ గోశాల ప్రాంగణంలో ఉన్న ఆవులు



కొండ ప్రాంతంలో పెంచుతున్న పశుగ్రాసం

దువ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయి సమీపంలోని తెలుగుంగ సబ్సిడరీ రిజర్వాయర్-1 వద్ద పర్లపాడుకు చెందిన జయరామిరెడ్డి, మరో గోప్రేమికుడు హరికృష్ణ ఆధ్వర్యంలో ముక్తిదామ గోశాలను ఏర్పాటు చేశారు. 2016 సంవత్సరంలో 11 ఆవుల పెంపకం చేపట్టి.. వాటి ఆలనా పాలన చూసేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిండి లేక ఆకలితో అలమటిస్తూ ఆవులు మృతి చెందాయి. వైద్యులు పోర్టుమార్టం చేయగా వాటి కడుపులో ప్లాస్టిక్ కవర్లు బయటపడ్డాయి. దీంతో చలించి పోయిన గోశాల నిర్వాహకులు ఓ షెడ్డును ఏర్పాటు చేసి.. వివిధ ప్రాంతాల నుంచి 200 ఆవులను తీసుకువచ్చి వాటికి సేవ చేయడం మొదలు పెట్టారు. వీరికి కొందరు దాతల సహకారం తోడు కావడంతో కమిటీ ఏర్పాటు చేసుకుని ఏడేళ్లుగా ఆవుల సేవలో తరిస్తున్నారు. ప్రస్తుతం 250 ఆవులకు ఈ ప్రాంతం జీవనాధారమైంది.

ఆవుల సంరక్షణకు...

ముక్తిదామ గోశాలను ప్రస్తుతం రూ.10 కోట్ల వ్యయంతో కొనసాగిస్తున్నారు. ఆవుల సంరక్షణకు మూడు షెడ్లను ఏర్పాటు చేశారు. షెడ్లలో చల్లదనం కోసం ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మించి 15 ఎకరాల్లో పశుగ్రాసం పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, ఎన్.రాఘవరెడ్డి, జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంగన హరినాథరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, గురివిరెడ్డి గోశాలను సందర్శించి ఆవుల సంరక్షణకు తగిన ఏర్పాట్లు గావిస్తున్నారు. ప్రతియేటా వీరు చందాలు ఇస్తున్నారు. కొందరి దాతల సహకారం కూడా ఆవుల జీవనానికి తోడ్పడుతోంది.

సమాజ సేవకే పాల వాడకం



ప్రస్తుతం 15 ఆవుల నుంచి పాలు తీస్తున్నాం. ఆ పాలను సమాజ హితానికి వినియోగిస్తాం. ఆయుర్వేద వైద్యానికి, పాలులేని పసిబిడ్డల కోసం, అభిషేకాల నిమిత్తం ఈ పాలు కావాలని వచ్చినవారికి అందిస్తాం. కొందరు రైతులు పండ్ల తోటల సంరక్షణ కొరకు జీవామృతంగా ఆవు పంచతాన్ని వాడుతారు. వచ్చినవారికి వాటిని అందజేస్తాం.

- ఎస్.విజయభాస్కర్‌రెడ్డి,
ముక్తిదామ గోశాల ప్రెసిడెంట్

టీటీడీ సహకారంతో...

గోశాల నిర్వహణకు తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం కూడా లభించింది. పుట్టా సుధాకర్‌యాదవ్ టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ముక్తిదామ గోశాల అభివృద్ధి కొరకు రూ.50లక్షలు మంజూరు చేయగా... తదనంతరం వైవీ సుబ్బారెడ్డి ఆ నిధులను రిలీజ్ చేసినట్లు గోశాల కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్తం

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులతో ఎస్ఐ

సుండుపల్లె, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎం వీధిలో సంఘ సేవకుడు సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా 30 మంది యువకులు రక్తదానం చేయడం సంతోషదాయకమన్నారు. అనంతరం రక్తదాతలను ఆయన సన్మానించారు.

ముత్యాల తలంబ్రాలు అందజేత



సుగవాసికి ముత్యాల తలంబ్రాలు అందించిన జ్యోతి సుబ్బారెడ్డి

సిద్దవటం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజేశ్వర శివపార్వతుల కల్యాణం ముత్యాల తలంబ్రాలను శనివారం ఉత్సవ కమిటీ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు అందజేశారు. పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, బీసీ అధికార ప్రతినిధి రాజశేఖర్, నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు, చెంచయ్యనాయుడు, పార్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'రాజగోపాల్‌రెడ్డి మృతి టీడీపీకి తీరని లోటు'



నివాళులర్పిస్తున్న డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి(ఇన్‌సెట్) రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)

రామాపురం, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కర్లపువాండ్లపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నల్లగుట్టపల్లె మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి మృతి చెందడం పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

జీతం ఇప్పించాలని వినతి

సుండుపల్లె, మార్చి1: మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీ గుండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న లక్ష్మమ్మకు గత 13 నెలల నుంచి జీతం (గౌరవ వేతనం) ఇవ్వడం లేదని, ఇప్పించాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుకు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సాయం చేయాలని కోరారు. జీతం ఇప్పించేలా చూస్తామని జగన్‌మోహన్‌రాజు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ఆకేపాటి వెంటనే రాజీనామా చేయాలి: టీడీపీ

రాజంపేట టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వందల ఎకరాలను కబ్జా చేసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాజంపేట టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చమర్తి సురేష్‌రాజు మాట్లాడుతూ ఆకేపాటి భవన్ పేరిట ఆక్రమించిన భూములన్నీ ప్రభుత్వానివని జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిందన్నారు. ఇంకా అనేక భూములను ఆన్‌లైన్ చేసుకుని రిజిస్టర్ చేసుకున్నారని, వాటిని కూడా బయట పెడతామన్నారు. టీడీపీ నాయకులు చొప్పా గోపాల్‌రెడ్డి, మలిశెట్టి అరుణాచలం, మైనార్టీ నాయకులు మస్తాన్‌బాషా, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతే లక్ష్యం

గాలివీడు, మార్చి1(ఆంధ్రజ్యోతి): బాలికా విద్యను ప్రోత్సహించడంతో పాలు లింగ వివక్షను రూపు మాపి బాలికల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సోనీ, అరుణకుమారిలు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు.ఉపాధ్యాయులు అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, మార్చి1: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతజయంతి ఉత్సవాలు ఈ నెల 9వ తేదీన అన్నమయ్య జిల్లా పరిధిలోని తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట పట్టణంలో నిర్వహించను న్నామని, విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పేర్కొన్నారు. శనివారం రాయచోటి సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం సుమిత్రమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఈ శతజయంతి ఉత్సవానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసనసభ్యుడు రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య తదితరులు హాజరవుతారన్నారు.

చిత్రం చెప్పిన సమస్య

రైల్వేకోడూరు పట్టణం మార్కెట్ వీధిలో డ్రైనేజి పైకప్పు దెబ్బతింది. దీంతో పెద్ద రంధ్రం ఏర్పడింది. నెల రోజులుగా ఈ రంధ్రాన్ని అధికారులు పట్టించుకోలేదని, ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా... అని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)



అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, మార్చి1(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి లక్ష్యమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం సుండుపల్లె మండల కేంద్రంలోని ఆరెమ్మ వీధి, జనార్దన్‌రెడ్డి నగర్‌లలో రూ.15 లక్షలతో నిర్మించే పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆరెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో పించన్ల పంపిణీ కార్యక్రమంపై ఆరా తీ శారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, టీడీపీ నాయకులు శివరాంనాయుడు, మోహన్‌బాబునాయుడు, సుబ్బరామ్, సురేశ్‌నాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, జనసేన నాకులు ఒంటేరు రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు వేంపల్లె సుబ్బన్న మృతి



రాజంపేట టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు వేంపల్లె సుబ్బన్న(80) శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. రాజంపేట పట్టణం మన్నూరులోని ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసి ఎన్జీవో భవన నిర్మాణానికి, వారి ఉన్నతికి ఎంతో కృషి చేశారు. ఆయన మృతిపట్ల ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు లావలూరి శ్రీనివాసులు, ప్రస్తుత అధ్యక్షుడు వెంకటరమణ సంతాపం తెలిపారు.

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు



వీరబల్లి, మార్చి1(ఆంధ్ర జ్యోతి): వంగిమళ్ల గ్రామంలోని పులుచెన్నారెడ్డిగారిపల్లెలో శనివారం గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనం ఎత్తుకొని బాణసంచా పేలుస్తూ ఊరేగింపుగా కుంకుమ బండి వద్దకు చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కుకున్నారు.

ఈ కార్యక్రమంలో వీఆర్ డీఎస్ సురేంద్రారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'కార్మిక వర్గాన్ని విస్మరించిన రాష్ట్ర బడ్జెట్'



రైల్వేకోడూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో కార్మిక వర్గాన్ని విస్మరించారని రైల్వేకోడూరులో శనివారం భవన నిర్మాణ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ మాట్లాడుతూ తక్కువ జీతాలు తీసుకునే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు సంక్షేమ పథకాల హామీ ప్రస్తావనే లేకపోవడం శోచనీయమన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీగా ఉందని వైసీపీ జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఎలకచర్ల శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఇది సంక్షేమ బడ్జెట్

చిట్వేలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది సంక్షేమ బడ్జెట్ అని టీడీపీ మండల యువ నాయకుడు, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ అన్నారు. శనివారం ఆయన చిట్వేలిలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ సహా మేనిఫెస్టోలోని హామీల అమలుకు పెద్దపీట వేశారన్నారు.

మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం



నివాళులర్పిస్తున్న నాయకులు

రాయచోటిటౌన్, మార్చి1(ఆంధ్ర జ్యోతి): మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు మాదిగ పేర్కొన్నా రు. శనివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన గల అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించి వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ అమరుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించి ప్రతి కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున భూమి పంపిణీ చేయడమే కాకుండా ఆయా కుటుంబాల్లో ఒక్కొరికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు రాష్ట్రంలో ఎటువంటి ఉన్నత విద్య, ఉద్యోగ నియామకాలు చేపట్టరాదని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు, ప్రజా సంఘాల నేతలు తాతయ్య, పామయ్య, హ్యూమన్ రైట్స్ స్టూడెంట్స్ నాయకులు శెట్టిపల్లి సాయికుమార్, ఎంఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటికి అధిక ప్రాధాన్యం

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటికి ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుందని డీఎల్‌పీఆర్‌వో ఎం.నరసింహమూర్తి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండల మీట్ ఎంపీడీవో అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర కార్యక్రమాలకు వేగవంతంగా చేయాలన్నారు. మండలాధ్యక్షురాలు భవాని, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎక్కడి పనులు అక్కడే ఉండేవని, వాటిని గుర్తించి పరిష్కారం చేశామన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండల ప్రజా పరిషత్ సభాభవనంలో శనివారం మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. మండలంలో నీటిఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. సమావేశానికి జంగాలపల్లె, పెద్దపల్లె, పొన్నోలు, టక్కోలి ఎంపీటీసీలు హాజరు కాగా ఉప్పరపల్లె, మాచుపల్లె, బొగిడివారిపల్లె, మాధవరం-1, 2, వంతాటిపల్లె, సిద్దవటం గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు గైర్హాజరయ్యారు.

చమర్తితో శ్రీరామ్ చిన్నబాబు భేటీ

రాజంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ పార్లమెంటరీ క్యాంపు కార్యాలయంలో శనివారం చమర్తి జగన్‌మోహన్‌రాజును రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని వారు చర్చించుకున్నారు.

రంజాన్ ప్రార్థనలు నూతన ఈద్గాలోనే: ముక్కా

రైల్వేకోడూరు రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రంజాన్ ప్రార్థనలు మైసూరివారిపల్లి నూతన ఈద్గాలోనే ఉంటాయని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం ముస్లింలతో సమావేశం నిర్వహించారు. రెండు రోజులలో పనులు ప్రారంభిస్తామన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పట్టాన్ మౌలా(అల్లాభకాష్), షేక్ జుబేర్ జామీయా మస్జీద్ అధ్యక్షుడు ముజీబ్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

తారు రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న బాలునాయక్

సంబేపల్లె,మార్చి1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో చేపట్టే తారు రోడ్డు పనుల్లో నాణ్యత పా టించాలని, లేకుంటే బిల్లులు చెల్లించేది లేదని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సీ) బాలునాయక్ సూచించారు. శనివారం సంబేపల్లె మండలంలోని నరసారెడ్డిగారిపల్లె, రోడ్డు బండకాడ హరిజనవాడ నుంచి చిన్నకోటివాండ్లపల్లె సబ్‌స్టేషన్ వరకు రూ.1.66 కోట్లు, దేవపట్ల గ్రా మం కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి నుంచి చిన్నబిడికి వరకు రూ.1.87 కోట్లతో చేపట్టే తారు రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈలు రవిచంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఎంపీడీవో రామచంద్ర, జేఈలు సందీప్, మాబుసాబ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలను రక్షిద్దాం.. చదివిద్దాం

చిట్వేలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :'ఆడబిడ్డలను రక్షిద్దాం.. చదివిద్దాం' అంటూ సీడీపీవో నిర్మలాజ్యోతి తెలిపారు. చిట్వేలిలో శనివారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఆడబిడ్డలే జగతికి మూలం అన్నారు. సింగనమల వీధిలో అప్పుడే పుట్టిన ఆడబిడ్డకు డ్రెస్, మి ఠాయిలతో వేడుక నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వసుంధరమ్మ, సురేఖరాణి, అంగన్వాడీ వర్కర్ సుజాత, సుధామణి, ఉన్నత పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు: ఎస్ఐ

సుండుపల్లె, మార్చి1(ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులు, స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పోలీసులు ఉపయోగించే పరికరాలపైన శనివారం అవగాహన కల్పించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు స్కూల్ పిల్లలకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వ చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగేశ్వరరావు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలేరమ్మ తిరునాళ్లు

గాలివీడు, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శెట్టివారిపల్లెలో వెలిసిన పోలేరమ్మ తిరుణాల ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3న సద్దలకూడు నైవేద్యంతో అమ్మవారి జాతరకు అంకురార్పణ చేస్తారు. 4న బోనాల సమర్పణ, సాయంత్రం ఆ సాధుడి కథతో జాతర ముగుస్తుందన్నారు. కాగా వగ్గం మల్లికార్జున, అంజనమ్మ దంపతులు మకరతోరణంతో కూడిన రెండు అడుగుల అమ్మవారి ఉత్సవమూర్తిని, చెన్నూరు రమణమ్మ కుటుంబ సభ్యులు త్రిశూలాన్ని శనివారం కమిటీ సభ్యులకు అందజేశారు.

ప్రజా పంపిణీలో ముగ్గిపోయిన బియ్యం



రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): ప్రజా పంపిణీలో ముగ్గిపోయిన బియ్యం వచ్చినట్లు సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. శనివారం రెడ్డివారిపల్లెలో రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తీసుకుని వచ్చారు. అందులో ముగ్గిపోయిన బియ్యం ఉన్నాయని ప్రజలు గు ర్తించారు. బియ్యం పంపిణీ చేసే వ్యక్తులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యంలో మట్టి, రాళ్లు, పురుగులు ఉన్నాయన్నారు.


కమనీయం.. వెంకన్న కల్యాణం



వెంకన్న కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

సుండుపల్లె, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుంపాడు పంచాయతీ ఆరోగ్యపురంలో వెలిసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఏడవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు అమ్మనాయక్ ఆధ్వర్యంలో వెంకన్న, శ్రీదేవి భూదేవిల కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని కలకడ మండలం కోన గ్రామ పంచాయతీకి చెందిన మండే భాగ్యలక్ష్మి, సుధాకర్, వెంకటేశ్వరి, రామచంద్రల కు టుంబ సభ్యులు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ముడుంపాడు గ్రామ పంచాయతీ కుర్వపల్లికి చెందిన తంబళ్ల శ్రీదేవి, రమణ కుటుంబీకులు నిర్వహించినట్లు తెలియజేశారు. గ్రామోత్సవం నిర్వహించారు.

బీజేపీలో చేరికలు



పార్టీ తీర్థం పుచ్చుకున్న నాయకులు

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చిట్వేలి మండలం తిమ్మయ్యగారిపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త రాటకొండ చంద్రశేఖర్, రైల్వేకోడూరు మండలం వైసీపీ రాయలసీమ మహిళా నాయకురాలు కుప్పాల జ్యోతి శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గడ్డం చంగల్‌రాజు ఆధ్వర్యంలో రాచకుంట చంద్రశేఖర్ పార్టీలో చేరారని తెలిపారు. అలాగే కుప్పాల జ్యోతి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో చేరారన్నారు.బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, నాయకులు తోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలా పెన్షన్ల పంపిణీ



పెన్షన్ పంపిణీ చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): పెన్షన్ల పంపిణీ ప్రతి నెలా పండుగలా సాగుతోంది. శనివారం మండలంలోని కె. బుడుగుంటపల్లెలో టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏకంగా రూ.1000 పెంచిందని ఆయన గుర్తు చేశారు.

మారుమూల మండలంలో మెరుగైన విద్య : ఏఎస్పీ



మాధురి స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అడిషనల్ ఎస్పీ వెంకటాద్రిని సన్మానిస్తున్న మాధురి స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్

సుండుపల్లె, మార్చి1(ఆంధ్రజ్యోతి): మారుమూల సుండుపల్లె మండలంలో మెరుగైన విద్యను అందించడం అభినందనీయమని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. శనివారం మండల కేంద్రానికి సమీపంలోని మాధురి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని విద్యార్థులతో పాటు పది శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని కోరారు. చిన్నతనం నుంచే మంచి అలవాట్లను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అలవాటు చేయాలన్నారు. మాధురిస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సుధాకర్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జబర్దస్త్ నటీనటులు డ్యాన్స్ కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మాధురి స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సుధాకర్, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పీలేరు వాసవీ అమ్మవారిని దర్శించుకుంటున్న దూండి రాకేశ్, తదితరులు

కూటమితో ఆర్యవైశ్యులకు గౌరవం

● ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేశ్

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం ఆర్యవైశ్యులకు చంద్రబాబు ప్రభుత్వం గౌరవం కల్పించిందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేశ్ అన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 'యువగళం' పాదయాత్రలో నారా లోకేశ్‌కు రాష్ట్ర ఆర్యవైశ్యులు చేసిన విజ్ఞప్తిపై స్పందించి అధికారంలోకి వచ్చిన తరువాత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ఆర్యవైశ్యులందరికీ గౌరవం కల్పించినట్లైందన్నారు. అలాగే పొట్టి శ్రీరాములు జయంతిని కూడా అధికారికంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందని, వచ్చే ఏడాది నుంచి ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఆర్యవైశ్య సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ బద్రీనాథ్, పీలేరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బలసా వేణుగోపాల్, సభ్యులు గణపతి, వంశీ, మహేశ్ గుప్తా, నాగరాజ, రేవూరి సుధీర్, జయచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవాలు

మదనపల్లె అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మహాకుంభాభిషేక మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి అమ్మవారి చిత్రపటం, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేష్ హాజరయ్యారు. కన్యకాపరమేశ్వరీ మాతను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, ప్రధాన కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి సూరే గిరిధర్, ఎల్లంపల్లె ప్రశాంత్, ప్రవీణ్, వాసవీ మహిళా సంఘాల సభ్యులు పర్యవేక్షించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు తమ అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పీలేరు డివిజనల్ ఇంజనీరు చంద్రశేఖర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెల్లించాల్సిన రుసుములో 50శాతం రాయితీ కల్పించిందని ఆయన తెలిపారు. 1 కిలోవాట్ అదనపు లోడుకు ఇది వరకు రూ.2250 చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం దానిని రూ.1250లకు కుదించారన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు, ఆధార్ కార్డులతో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట


ఎస్పీ కార్యాలయ ఆవరణలో ప్రేమికులు

రైల్వేకోడూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును శనివారం ఓ ప్రేమజంట ఆశ్రయించింది. ఆ వివరాల్లోకి వెళితే.. చిట్వేలి మండల పరిధిలో ఉన్న నగిరిపాడు గొల్లపల్లెకు చెందిన పవన్ కుమార్, మదనపల్లెకు చెందిన శిల్ప ప్రేమించుకున్నామని, తల్లిదండ్రులకు ఈ విషయాన్ని వివరించామని తెలిపారు. అయితే ఇరువురు తల్లిదండ్రులు ఇందుకు అంగీకరించలేదని, దీంతో తాము కడప ఆంజనేయస్వామి ఆలయంలో పెళ్లి వివాహం చేసుకున్నామన్నారు. దీంతో తమ కుటుంబ సభ్యులు చంపుతామని బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కావాలని పోలీసులకు విన్నవించారు. తాము మేజర్లమని, ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. కాగా శిల్ప తిరుపతిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పవన్‌కుమార్ ఫ్లిప్‌కార్ట్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రామసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మాలేనత్తం పంచాయతీ కుప్పనపల్లెకు చెందిన గంగులప్ప(62) కుదురుచీమనపల్లెలో పనికి వెళ్లి చింతకాయల కోసం చెట్టు ఎక్కాడు. కాయలు కోస్తుండగా చెట్టు కొమ్మలను ఆనుకుని ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్ తగలడంతో మృతి చెందాడు. చెట్టు కింద కాయలు ఏరుతున్న ప్రమీలమ్మపై మృతుడు పడటంతో ఆమెకు కాలు విరిగింది. 108లో ఆమెను ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన గంగులప్పకు ముగ్గురు కూమార్తెలు. చెట్టుకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను సరిచేయకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, విద్యుత్ అధికారుల నిర్ల క్ష్యానికి నిదర్శనమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గేదెల మృతి


సంబేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లి గ్రామం ఎర్రగుంట్ల హరిజనవాడ నివాసి అయిన అంజనమ్మకు చెందిన 3 గేదెలు, 3 దూడలు శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాయి. మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన గేదెలు కాళ్ళు బిగుసుకుపోయి ఒక్కసారిగా కింద పడి ప్రాణాలు విడిచినట్లు బాధితురాలు తెలిపారు. ఒకేసారి ఆరు మూగజీవాలు మృతి చెందడంతో ఆమె బోరున విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

రామన్న స్థలాలపై.. టీటీడీ నిర్లక్ష్యం..

వాల్మీకిపురం పట్టాభిరాముడిపై మండల ప్రజలకు భక్తి ఎక్కువ. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కానీ శతాబ్దాల చరిత్ర కలిగిన పట్టాభిరాముడి ఆలయ స్థలాలపై టీటీడీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు వస్తే కానీ ఆయా స్థలాలపై శ్రద్ధ చూపడం లేదు. శిథిలావస్థలో ఉన్న మండపం, గరుడ పుష్కరిణిని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. స్వామివారి చక్రస్నాన ఘట్టం ఒక గంగాళం నీటిలో చేస్తున్నారంటే ఎంతటి నిర్లక్ష్యమో అర్థమవుతోంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి మరమ్మతుల దిశగా చర్యలు తీసుకుంటారని భక్తుల కోరిక.


బ్రహ్మోత్సవాలలో గంగాళంలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు(ఫైల్‌ఫొటో)





- ● దుర్గంధంగా కల్యాణ వేదిక స్థలాలు
- ● శిథిలావస్థలో పార్వేట మండపం
- ● గరుడ పుష్కరిణి అభివృద్ధి ఏనాటికి జరిగేనో..?
- ● భక్తుల ఆవేదన

వాల్మీకిపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉందని పెద్దల మాట. అలాంటి ఆలయం టీటీడీ ఆధీనంలోకి వెళ్లినప్పటి నుంచీ ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాల్లో ఎంతో ప్రాచుర్యం సంతరించుకుంది. ఆలయానికి సంబంధించిన స్థలాలు పలుచోట్ల అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్నాయి. బైపాస్ రోడ్డులో తోటవీధి ప్రాంతంలో ఉన్న టీటీడీ స్థలాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఏటా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇదే ప్రాంతంలో భారీ ఏర్పాట్ల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తుంటారు. వారం రోజుల బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తారు. కల్యాణం అనంతరం ఈ స్థలాలను పట్టించుకోవడం లేదు. మళ్లీ మరుసటి ఏడాది వస్తే కానీ టీటీడీ అధికారులు ఈ స్థలాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. టీటీడీకి సంబంధించిన రెండెకరాలకు పైగా స్థలాలకు గొప్పగా ప్రహరీ, గేట్లు ఏర్పాట్లు చేసినా అన్యాక్రాంతంగా మారిపోతున్నాయి. ఆలయ స్థలాలని తెలిసినా కొందరు దుర్గంధంగా తయారు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 15 ఏళ్లుగా స్వామివారి కల్యాణ వేదిక ఏర్పాట్ల ఖర్చు ఇప్పటివరకు చూస్తే రూ.కోటి పైమాటే. కానీ శాశ్వత షెడ్లు నిర్మిస్తే టీటీడీకి ఆదాయం, ఖర్చు కూడా తగ్గుతుంది. అలాగే సీతారాముల కల్యాణం జరిగే ప్రాంతంలో పేద కుటుంబాలు పెళ్లిళ్లు చేసుకునేలా మండపం ఏర్పాటు చేయాలని, ఆ దిశగా టీటీడీ అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఉన్న టీటీడీ స్థలాలను కూడా పట్టించుకోకపోవడం విచారకరం.

శిథిలావస్థలో పార్వేట మండపం


పట్టాభిరామాలయానికి అనుబంధంగా ఉన్న పార్వేట మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. అది నేడోరేపో కూలేందుకు సిద్ధంగా ఉన్నా టీటీడీ ఏమాత్రం పట్టించుకోలేదు. మండపం స్తంభాలపై అనేక శిల్పాలు, దేవుడి బొమ్మలు ఉన్నాయి. ప్రస్తుతం ఫ్లోరింగ్ లేక బండలు ఎక్కడపడితే అక్కడ పడున్నాయి. పైకప్పుపై మట్టి పేరుకుపోయి గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి. చారిత్రక శిల్పకళను కాపాడి పార్వేట మండపం భావితరాలకు ఉపయోగపడేలా టీటీడీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్వం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో చక్రస్నాన ఘట్టాన్ని స్వామివారి గరుడ పుష్కరిణిలో వైభవంగా నిర్వహించేవారు. గడిచిన పదేళ్లలో చక్రస్నాన ఘట్టాన్ని భక్తులు తిలకించలేకపోవడం బాధాకరం. ప్రస్తుతం గంగాళం నీటిలో స్వామివారి చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి కల్యాణ వేదిక స్థలాలు, పార్వేట మండపం, గరుడ పుష్కరిణి అభివృద్ధి పట్ల చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

కల్యాణ వేదిక స్థలాలను పరిశీలించి శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతాం. స్థానికుల అభిప్రాయాల మేరకు ప్రతి విషయం టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పట్టాభిరామాలయ పార్వేట మండపం, గరుడ పుష్కరిణిలో పునరుద్ధరించే దిశగా ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

- కృష్ణమూర్తి, ఈవో, పట్టాభిరామాలయం, వాల్మీకిపురం


దుర్గంధంగా పట్టాభిరాముడి కల్యాణ వేదిక స్థలాలు


శిథిలావస్థకు చేరిన పార్వేట మండపం


నిరుపయోగంగా కోనేటివీధిలోని పట్టాభిరాముడి గరుడ పుష్కరిణి

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు : సబ్ కలెక్టర్


రైతుల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

బి.కొత్తకోట మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించాలని, భూ ఆక్రమణదారులపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఫ్రీహోల్డ్ భూములు, రెవెన్యూ సదస్సు అర్జీలు, భూముల రీసర్వే, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి వీఆర్వోను విడివిడిగా మాట్లాడి ఆయా రెవెన్యూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌పై వివరణ కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూసమస్యలపై 5890 అర్జీలు వచ్చాయని, వాటిలో 4669 పరిష్కారించారన్నారు. బి.కొత్తకోట మండలంలో అత్యధికంగా 1023 అర్జీలు ఇచ్చారని, వాటిలో సరైన ఆధారాలు ఉన్న వాటిని పరిష్కరించి లేనివాటికి ఎండార్స్‌మెంట్ ఇచ్చామన్నారు. హార్సిలీహిల్స్‌లో టౌన్‌షిప్ కమిటీ మీటింగ్ త్వరలో నిర్వహించి అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ భూసమస్యలపై స్థానికులు ఇచ్చిన అర్జీలను తీసుకుని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజారుద్దీన్, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

నిమ్మనపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చిన వృద్ధురాలు ఓబులమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ముష్టూరు పంచాయతీకి చెందిన ఓబులమ్మ బెంగళూరులో కుమారుడి వద్ద ఉంటోంది. అయితే వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు వచ్చిన ఆమె తన మనవడి కోసం ముష్టూరు క్రాస్ వద్ద వేచివుంది. ఇంతలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలో ఉన్న 25గ్రాముల బంగారు గొలుసును లాక్కుని మదనపల్లె వైపునకు వెళ్లిపోయారు. గొలుసు విలువ సుమారు రూ.లక్ష 70వేలు వుటుందని, ఆమె కుమారుడు వాసుదేవ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

మదనపల్లె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మదనపల్లె మున్సిపల్ పరిధిలోని సిద్ధమ్మ లేఅవుట్, పీఅండ్‌టీ కాలనీ, సొసైటీ కాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డెప్పకాలనీలలో రూ.1.66 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం శనివారం భూమి పూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చైర్ పర్సన్ మనూజ అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేణుక, నాయకులు నవీన్‌చౌదరి, భాస్కర్, నాగయ్య, రామకృష్ణ, రమణ, శశికుమార్, రంగస్వామినాయుడు, సహదేవనాయుడు, జాన్‌బాబు, జేసీబీ ఈశ్వర్ నాయుడు, జీవీ నాయుడు, విజయమ్మ, పులి మహాలక్ష్మి, రాధా, జాఫర్‌రున్నిస్సా, పద్మమ్మ, మాజీ కౌన్సిలర్ బాబ్జీ, జనసేన వీర మహిళ దాదం అనిత తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

● టీటీడీ ఈవో శ్యామలారావు

(5వ పేజీ తరువాయి..)

ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు వచ్చే అవకాశం ఉందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, టీటీడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా వృషభలగ్నంలో ఉదయం 9.30 నుంచి 10.15 గంటల మధ్య ధ్వజారోహనం, సాయంత్రం శేషవాహనం, 7న వేణుగాన అలంకారం, హంస వాహనం, 8న వటపత్రశాయి అలంకారం, సింహవాహనం, 9న నవనీతకృష్ణ అలంకారం, హనుమంత వాహనం, 10న మోహినీ అలంకారం, గరుడసేవ, 11న శివ ధనుర్బాణ అలంకారం, సీతారాముల కల్యాణం (రాత్రి 8.30 గంటలకు), గజవాహనం, 12న రథోత్సవం, 13న కాళీయమర్దన అలంకారం, అశ్వవాహనం, 14న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహనం, 15న రాత్రి పుష్పయాగం ఉంటుందని తెలిపారు.

టీడీపీ నేతల వినతి..

ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఎన్నో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని ఈవోకు ఒంటిమిట్ట టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా గతంలో సీఎం చంద్రబాబునాయుడు రూ.వంద కోట్ల అభివృద్ధి ప్రణాళికను ప్రకటించగా ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. చెరువు కట్టపై ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేయాలని, శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని, అసంపూర్తిగా ఉన్న కల్యాణమండపాన్ని పూర్తి చేయాలని, బోటు షికారు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టీడీపీ బీసీ నేత ఎస్వీ రమణ ఉన్నారు.

శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం

కలకడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం త్రిశూల స్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ఉన్న పుష్కరిణిలో జలాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, వసంతోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, శ్రీనివాసులునాయడు, రెడ్డెప్పనాయుడు, జి.కుమార్‌నాయు డు, మల్లికార్జునాయుడు, హిమగిరినాయుడు, రైస్‌మిల్ రమణ, నరసింహులు, పుణ్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


కోనేరులో త్రిశూల స్నానం చేస్తున్న అర్చకులు, భక్తులు

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

- ● ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- ● పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరుణించి కాపాడమ్మా గంగమ్మతల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతరలో భాగంగా శనివారం నిండు తిరుణాళ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పుట్టినిల్లు అయిన చాగల గుట్టపల్లె నుంచి తెల్లవారుజామున బయలుదేరి ఉదయం 7గంటలకు గంగమ్మజాతరకు చేరుకోగానే జాతర మొదలైంది. సంప్రదాయబద్ధంగా రోడ్డు రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీసమేతంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే కలెక్టర్ చామకూరి శ్రీధర్ దంపతులు, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు, మంత్రి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా గొల్లపల్లె చెల్లు వంశీయులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పొంగుబాలు సమర్పించారు. అనంతరం ఈడిగపల్లెకు చెందిన ఈడిగ కులస్తులు కల్లు తీర్థం, చౌటపల్లెకు చెందిన రామయ్య కుటుంబీకులు సిద్ధలకూడు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి 10గంటలకు ఆలయం చుట్టూ కుంకుమ బండ్లు, చాందినీ బండ్లను రంగురంగుల విద్యుత్ దీపాలంకర ణలతో, బాణాసంచా పేల్చుతూ వైభవంగా ఊరేగించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు, మండల యువజన నాయకుడు యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో 25 ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేశారు. మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, మరుగుదొడ్లు, పారిశుధ్యం తదితర వసతులను ఏర్పాటు చేశారు. అలాగే మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.


అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

పోలీసుల పర్యవేక్షణ

గంగమ్మజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర చుట్టూ నాలుగు ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించడానికి ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు.

ఘనంగా బండలాగుడు పోటీలు

గంగమ్మజాతర సందర్భంగా ఎద్ల బండలాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల ఎద్లు పాల్గొన్నాయి. బాలయ్యగారిపల్లె, ఆలంఖాన్‌పల్లె, గొల్లపల్లె, కుమ్మరికొట్టాలు, తిప్పిరెడ్డిపల్లె, ఓబులంపల్లె, పోతిరెడ్డిపల్లె, ప్రాంతాలకు చెందిన ఎద్లు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.లక్షను శ్రీనివాసగౌడ్, ద్వితీయ బహుమతి రూ.80వేలు మండిపల్లి కుటుంబీకులు, తృతీయ బహుమతి రూ.60వేలను శివప్రసాద్ అందజేశారు.


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి మండిపల్లి


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన జబర్దస్త్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా రేలారే..రేలా జానపద గేయాలు, అనంతరం పంచ్ ప్రసాదు, చలాకీ చంటి, మరికొంత మంది జబర్దస్త్ కళాకారులు భక్తులను కడుపుబ్బ నవ్వించారు. ఆర్కెస్ట్రా కళాకారులు సినిమా పాటలు పాడారు.



మానవసేవే మాధవ సేవ అంటారు.. ఈ సూక్తిని ఆదర్శంగా తీసుకున్నారు కొందరు గో ప్రేమికులు.. ఆకలి దప్పికలతో అలమటిస్తూ.. ఏవి దొరికితే (ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు, ఎముకలు) అవి తింటూ మృత్యు వాత పడుతున్న ఆవులను చూసి చలించిపోయారు. వాటి ఆలనా పాలన కోసం గోశాలను ఏర్పాటు చేసి.. వాటి సేవలో తరిస్తున్నారు.

గోమాతల సేవలో..

● ఆవుల సంరక్షణ కోసం గోశాల ఏర్పాటు



ముక్తిదామ గోశాల ప్రాంగణంలో ఉన్న ఆవులు



కొండ ప్రాంతంలో పెంచుతున్న పశుగ్రాసం

దువ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయి సమీపంలోని తెలుగుగంగ సబ్సిడరీ రిజర్వాయర్-1 వద్ద పర్ల పాడుకు చెందిన జయరామిరెడ్డి, మరో గోప్రేమికుడు హరికృష్ణ ఆధ్వర్యంలో ముక్తిదామ గోశాలను ఏర్పాటు చేశారు. 2016 సంవత్సరంలో 11 ఆవుల పెంపకం చేపట్టి.. వాటి ఆలనా పాలన చూసేవారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిండి లేక ఆకలితో అలమటిస్తూ ఆవులు మృతి చెందాయి. వైద్యులు పోర్టు మార్టం చేయగా వాటి కడుపులో ప్లాస్టిక్ కవర్లు బయటపడ్డాయి. దీంతో చలించి పోయిన గోశాల నిర్వాహకులు ఓ షెడ్డును ఏర్పాటు చేసి.. వివిధ ప్రాంతాల నుంచి 200 ఆవులను తీసుకువచ్చి వాటికి సేవ చేయడం మొదలు పెట్టారు. వీరికి కొందరు దాతల సహకారం తోడు కావడంతో కమిటీ ఏర్పాటు చేసుకుని ఏడేళ్లుగా ఆవుల సేవలో తరిస్తున్నారు. ప్రస్తుతం 250 ఆవులకు ఈ ప్రాంతం జీవనాధారమైంది.

ఆవుల సంరక్షణకు...

ముక్తిదామ గోశాలను ప్రస్తుతం రూ.10 కోట్ల వ్యయంతో కొనసాగిస్తున్నారు. ఆవుల సంరక్షణకు మూడు షెడ్లను ఏర్పాటు చేశారు. షెడ్లలో చల్లదనం కోసం ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మించి 15 ఎకరాల్లో పశుగ్రాసం పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, ఎన్.రాఘవరెడ్డి, జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంగన హరినాథరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, గురివిరెడ్డి గోశాలను సందర్శించి ఆవుల సంరక్షణకు తగిన ఏర్పాట్లు గావిస్తున్నారు. ప్రతియేటా వీరు చందాలు ఇస్తున్నారు. కొందరి దాతల సహకారం కూడా ఆవుల జీవనానికి తోడ్పడుతోంది.

సమాజ సేవకే పాల వాడకం



ప్రస్తుతం 15 ఆవుల నుంచి పాలు తీస్తున్నాం. ఆ పాలను సమాజ హితానికి వినియోగిస్తాం. ఆయుర్వేద వైద్యానికి, పాలులేని పసిబిడ్డల కోసం, అభిషేకాల నిమిత్తం ఈ పాలు కావాలని వచ్చినవారికి అందిస్తాం. కొందరు రైతులు పండ్ల తోటల సంరక్షణ కొరకు జీవామృతంగా ఆవు పంచతాన్ని వాడుతారు. వచ్చినవారికి వాటిని అందజేస్తాం.

- ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ముక్తిదామ గోశాల ప్రెసిడెంట్

టీటీడీ సహకారంతో...

గోశాల నిర్వహణకు తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం కూడా లభించింది. పుట్టా సుధాకర్‌యాదవ్ టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ముక్తిదామ గోశాల అభివృద్ధి కొరకు రూ.50లక్షలు మంజూరు చేయగా... తదనంతరం వైవీ సుబ్బారెడ్డి ఆ నిధులను రిలీజ్ చేసినట్లు గోశాల కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్



ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

కడప కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం రిజర్వాయర్ల ద్వారా సుస్థిరమైన సురక్షిత తాగునీరు అందించేందుకు తలపెట్టి న ప్రాజెక్టు ప్రణాళికల సన్నద్ధతపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతా లకు ఎలాంటి తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులకు ప్రతిపాదనలను అందజేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తెలుగుగంగ ఆర్-1, బ్రహ్మంసాగర్, మైలవరం, గండికోట, చిత్రావతి రిజర్వాయర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 55 ఎల్‌పీసీడీ (రోజుకు వినియోగించే తలసరినీరు) పట్టణ ప్రాంతాల్లో 135 ఎల్‌పీసీడీ శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డ బ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్‌వీ కన్సల్టెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వారోత్సవాలు ప్రారంభం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని డి-బ్లాక్ నుంచి భేటి బచావో-భేటి పడావో అనే నినాదంతో బైక్ ర్యాలీని ప్రారంభించారు. జేసీ అదితి సింగ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ 3వ తేదీన బాల్య వివాహాల నిర్మూలన కోసం కొవ్వొత్తుల ర్యాలీ, మండల కార్యాలయాల వద్ద సంతకాల సేకరణ నిర్వహించాలన్నారు. 4వ తేదీన పౌష్టికాహారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 5న కౌమార దశ బాలికలకు కెరీర్ అవకాశాలపై అవగాహన తరగతులు, 6న బ్యాంక్ మేళా, 7న మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమాలు, 8న జిల్లాస్థాయిలో మహిళా, చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన నిర్వహించనున్నట్లు వివరించారు.

రాష్ట్ర బడ్జెట్ కోతల బడ్జెట్ : తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కోతల బడ్జెట్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్-6 హామీలతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, బడ్జెట్‌లో సూపర్-6 హామీలకు మంగళం పాడారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 20 లక్షలమంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కోసం బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో 83 లక్షలమంది విద్యార్థులు ఉండగా వారికి తల్లికి వందనం పథకానికి కేవలం 9,407 కోట్లు కేటాయించారన్నారు. అన్నదాన సుఖీభవ పథకానికి 10,600 కోట్లు అవసరం కాగా రూ.6,300 కోట్లతో సరిపెట్టారని విమర్శించారు. 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు పింఛన్లు ఇవ్వడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని తెలిపారు.

నలుగురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లు అరెస్టు

● రూ.5.60 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, పట్టుబడిన బుకీలతో సీఐ లింగప్ప

జమ్మలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం రాత్రి నలుగురు క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రావులకొల్లు నాగేంద్ర, జమ్మలమడుగు పట్టణానికి చెందిన సకిలిగిరి మాలిక్‌బాష, డి.జమాల్‌బాష, గడ్డం మాలిక్‌లు జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బెట్టింగ్‌కు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఢిల్లీక్యాపిటల్స్ వీఎస్ ముంబై జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను చూస్తూ పై నలుగురు వ్యక్తులు పందెం కాస్తున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5.60 లక్షలు నగదు, నాలుగు ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, బెట్టింగ్ రాయుళ్ల వద్ద భారీగా డబ్బులు పట్టుబడినట్లు జమ్మలమడుగు పట్టణంలో ప్రచారం ఉంది.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

● పొలం తగాదాలే హత్యకు కారణం : డీఎస్పీ

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం దిగువపల్లె గ్రామానికి చెందిన పప్పూరి గంగిరెడ్డి హత్యకు పొలం తగాదాలే కారణం అని డీఎస్పీ మురళీ తెలిపారు. హత్యకేసులో నిందితుడు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ బొర్ర ప్రతాప్‌రెడ్డి (45)ని శనివారం సాయంత్రం 5గంటలకు పులివెందుల రూరల్ ఇన్‌స్పెక్టరు ఎన్‌వీ రమణ అరెస్టు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మీడియా సమావేశంలో తెలిపారు.

దిగువపల్లెకు చెందిన కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి అతని అన్న కేతిరెడ్డి నాగేశ్వ ర్‌రెడ్డికి ఒక్కొక్కరికి 4ఎకరాల 50 సెంట్లు చొప్పున వ్యవసాయ భూమి ఉంది. ప్రతాప్‌రెడ్డి అన్నకు అప్పులు ఉండటంతో సుమారు పదేళ్ల క్రితం అతని 4 ఎకరాల 50 సెంట్లు వ్యవసాయ భూమిని దిగువపల్లెకు చెందిన పప్పూరు గంగిరెడ్డి చిన్నకుమారుడు దామోద ర్‌రెడ్డికి అమ్ముకున్నాడు. దీంతో ప్రతాప్‌రెడ్డి పొలంలో అరటిపంట కోత ఉన్నప్పుడు లారీ వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈవిషయమై పప్పూరి గంగిరెడ్డితో గొడవపడుతూ ఉండేవాడు. ఈ నేప థ్యంలోనే తన అన్న పొలం నుంచి తనకు ఎందుకు దారి ఉండ దంటూ ఫిబ్రవరి 24న పొలం వద్ద గంగిరెడ్డితో ప్రతాప్‌రెడ్డి ఘర్షణ పడి మచ్చు కొడవలితో నరికి చంపాడు. ఈవిషయం నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎన్‌వీ రమణ, లింగాల మండల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలి

● అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు
● జిల్లా ఇన్‌చార్జ్ సప్లయర్స్ ఆఫీసరు చంద్రిక



రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న జిల్లా సివిల్ సప్లై అధికారి

పులివెందుల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనం ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని.. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా సివిల్ సప్లై అధికారి చంద్రిక అన్నారు. జేసీ అదితి సింగ్ ఆదేశాల మేరకు ఆమె నిత్యావసర సరుకులు పంపిణీని స్థానిక ఆర్డీవో, తహసీ ల్దారులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామం, పులివెందుల పట్టణంలోని వార్డుల్లో శనివారం ఉదయం రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందా లేదా అని ఆరా తీశారు. పంపిణీ చేసేవారికి తగు సూచనలు చేశారు. పట్టణంలో గత రెండు నెలలుగా కందిబేడలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు అడగ్గా ప్రభుత్వం నుంచి షార్టేజీ ఉండడం వల్ల రాలేదని.. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తాయన్నారు. మొత్తం 14 ఎండీయూ వాహ నాలు ఉండగా... 12 వాహనాల ద్వారానే పంపిణీ జరుగుతుందని.. మిగ లిన రెండు వాహనాలను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. రేషన్ పంపిణీ జరిగే చోట ఎక్కడైనా లబ్ధిదారులు తీసుకోవచ్చు అని.. ప్రతి రేషన్‌షాప్‌లో 1వ తేదీ నుంచి 15 వరకు కచ్చితంగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, తహసీల్దారు మహ్మద్ నజీర్, డిప్యూటీ తహసీల్దారు సుధీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

టీడీపీ నేత పీరయ్య ఆకస్మిక మృతి



కడప మారుతీనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ నాయకుడు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మాజీ కౌన్సిల్ మెంబర్ పోతు గంటి పీరయ్య ఆకస్మిక మృతి చెందాడు. ఆయన అనా రోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందు తూ శనివారం మృతి చెందాడు. పీరయ్య మృతి బాధా కరమని.. పార్టీకి తీరని లోటు అని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ అన్నా రు. అలాగే పీరయ్య మృతి పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్ర సాద్, వీఎస్ అమీర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ కడప జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడిగా, తెలుగు దేశం పార్టీ నాయకుడిగా ఆయన చేసిన కృషి పార్టీ ఎన్న టికీ మరువలేదన్నారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మృతి



జగన్మోహనాచార్యులు (ఫైల్)

సత్యవేడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహనాచార్యులు (54) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో పరీక్షల ప్రధాన అధికారిగా ఆయన శుక్రవారం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పనులు పూర్తయ్యే సరికి పొద్దుపోయింది. ఇంటికి (తిరుపతికి) వెళ్లకుండా రాత్రి కాలేజీలోనే బసచేశారు. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో స్పృహ కోల్పోయారు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందారు. తిరుపతి లోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కళాశాలకు చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ మరణంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వస్థలం కడప జిల్లా జమ్మలమడుగు మండలం. 2023లో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● మార్చి 6 వరకు గడువు



నాణ్యమైన విద్య పొందే అవకాశం ఉంటుంది.

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడి యట్‌లో చేరేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచిత విద్య, భోజనం, వసతి, పుస్తకాలు పొందే అవకాశం ఉంటుంది. అర్హులైన వారు మార్చి 6లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఆయా గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు. జిల్లాలోని 13 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాల, బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలకు ప్రవేశపరీక్షలు నిర్వహిస్తున్నారు. 5వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12గం టల మధ్య ప్రవేశపరీక్ష ఉంటుంది. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు పరీక్ష జరుగు తుంది. ప్రవేశం పొందిన వారికి టెక్స్ట్ బుక్కులు, నోట్‌బుక్కులు ఉచితంగా ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్య పొందే అవకాశం ఉంటుంది.

అర్హులు వీరే... : 5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, బాలబాలికలు 2012 సెప్టెం బరు 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. బీసీ, ఓసీ, బీసీ-సి వర్గాలకు చెంది న విద్యార్థులు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. అదేవిధంగా జూనియర్ ఇంటర్‌కు సబంధించి 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థుల తల్లి దండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించి ఉండకూడదు. ఒక్కో పాఠశాలలో 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు గ్రూపులలో 40సీట్ల చొప్పున 80 సీట్లు ఉంటాయి.



ప్రతిభ ఆధారంగానే సీట్లు

ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు కల్పిస్తాం. జిల్లాలో 13 స్కూళ్లలో 1040 సీట్లు ఉంటాయి. ఇంటర్ రెండు గ్రూపులకు కలిపి 880 సీట్లు ఉంటా యి. అర్హులైన పేద కుటుంబాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-అంపావతి ఉదయశ్రీ, జిల్లా కోఆర్డినేటర్

పాఠశాలలు, కళాశాలలు ఇవే...

బాలురు : బ్రహ్మంగారిమఠం -1,2, గండి క్షేత్రం, పులివెందుల, సగిలేరు. **బాలికలు:** చిన్నచౌకు, కమలాపురం, తొండూరు, మడకల వారిపల్లె, రాజుపాలెం, కొండాపురం, పులివెందుల, గుండ్లకుంట.

సారా తయారీతో సమాజంలో దుష్పరిణామాలు



పత్తేగడ పాలెం ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్

కలికిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాటు సారా కారణంగా సమాజంలో అనేక దుష్పరిణామాలు తలెత్తగలవని రాయచోటి ఎక్సైజ్ అధికారి మధుసూదన్ స్పష్టం చేశారు. సారా తయారీపై ఆధారపడిన వారు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. శనివారం పత్తేగడ పంచాయతీ పాలెం గ్రామస్తులతో జరిగిన సమావేశంలో నాటు సారా తయారీకి వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. నాటు సారా నిర్మూలన కోసం ప్రభుత్వం నవోదయ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సారా తయారీదారుల జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను చూపించేందుకు సిద్ధంగా వున్నామన్నారు. అనంతరం గ్రామస్తులతో సారా వ్యతిరేక ప్రమాణం చేయించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి జోగేంద్ర, తహసీల్దారు మహేశ్వరీబాయి, వాయల్పాడు ఎక్సైజ్ సీఐ కె.ఎస్.లత, ఎస్ఐ సుభాషిణి పాల్గొన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహకరించండి

- సీఎం చంద్రబాబును కోరిన ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



చంద్రబాబును కలిసిన జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమానికి హాజరైన చంద్రబాబును జయచంద్రారెడ్డి కలిశారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెనుక బడిన నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పారిశ్రామిక వాడలు, రైతుల కోసం టమోటా, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయాలని కోరారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

పీలేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అగ్రహారం పంచాయతీ కమ్మమిట్టపల్లె దళితవాడలో శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అఖిల భారత మాల సంఘాలు (ఏబీఎంఎస్) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గుర్రం నారాయణ డిమాండ్ చేశారు. పీలేరు ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ గతంలో తాము చేసిన విజ్ఞప్తి మేరకు కమ్మమిట్టపల్లె దళితవాడలో శ్మశాన వాటిక ఏర్పాటుకు తహసీల్దారు అంగీకరించి ఎంపీడీఓకు సిఫారసు చేశారన్నారు. అయితే ఎంపీడీఓ ఎందుకనో జాప్యం చేస్తున్నారన్నారు.

అసంపూర్తిగా నాడు -నేడు

అర్థంతరంగా ఆగిన మరుగుదొడ్లు- అవస్థలు పడుతున్న విద్యార్థినులు

పనులు పూర్తి కాకుండానే బిల్లులు బొక్కేయడం ● దుర్వినియోగమవుతున్న లక్షల నిధులు



రంగసముద్రం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అసంపూర్తిగా వంటగది నిర్మాణం

పెద్దతిప్పసముద్రం మార్చి1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన నాడు - నేడు పనులు అస్మదీయులకు ఆదాయం చేకూర్చేందుకే అన్న ఆరోపణ అక్షర సత్యం. 'నాడు - నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తాం.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామంటూ' వైసీపీ పాలకుల ప్రకటనలు ప్రచారటోపమని చెప్పవచ్చు. నామమాత్రపు పనులు అరకొరగా చేసి బిల్లులు కాజేసిన వైసీపీ పాపం విద్యార్థులకు శాపంలా మారింది. వివరాల్లోకెళితే...

మండలంలోని 29 పాఠశాలలకు వైసీపీ ప్రభుత్వం నాడు -నేడు పథకం ద్వారా నిధులను కేటాయించింది. ఆయా పాఠశాలల్లో పనులను ప్రారంభించారు. అరకొర పనులు చేపట్టి నిధులు నిలిచి పోవడంతో కాంట్రాక్టర్లు మిన్నకుండి పోయారు. రెండో విడతగా మరికొన్ని పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు పూనుకుంది. దీంతో రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు గదులు, వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. అదనపు భవనం, వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తి కాకుండానే నిధులను పక్కదారి పట్టించారు. పాత భవనాలకే నామమాత్రపు మరమ్మతులు చేపట్టి అందినకాడికి దోచుకున్నారు. ఫలితంగా ఎక్కడి అక్కడే పూర్తిగా నిలిచి పోయాయి.



పాఠశాల ప్రధాన గేటు

అర్థంతరంగా వంటగది నిర్మాణం

రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులు సుమారు 190 మంది చదువుతున్నారు. వీరికి మధ్యాహ్నం భోజనం వండాలంటే వంటగది పూర్తి కాకుండా పోవడంతో ఆరుబయ టే వండాల్సిన దుస్థితి నెలకొంది. రంగసముద్రం పంచాయతీలోనే సుమారు రూ. 70లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నా రు. పాఠశాల భవనం, సచివాలయ భవనం రూ. 45 లక్షలతో నిర్మాణం పూర్తి చేసినా ఇంతవరకూ ప్రభుత్వానికి స్వాధీనం చేయకపోవడం గమనార్హం. కనీసం కూటమి ప్రభుత్వమైనా పనులను పూర్తి చేస్తారో లేదోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

మరుగుదొడ్లు లేక అగచాట్లు

పాఠశాలలో సుమారు 190 మంది విద్యార్థులు ఉన్నా కనీసం ఈ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో విద్యార్థినుల కష్టాలు వర్ణనాతీతం, విద్యార్థినులు, పాఠశాలలో పని చేసే మహిళా టీచర్లు సైతం కష్టాలు ఎదుర్కొంటున్నారు. కనీసం ఇప్పటికైనా రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేసి పాఠశాల అభివృద్ధికి దోహద పడాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం





పరీక్ష కేంద్రంలోకి పరుగెడుతున్న విద్యార్థిని - పీలేరు జూనియర్ కళాశాలలో నిరీక్షిస్తున్న విద్యార్థులు - విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్), మార్చి 1: విద్యార్థుల ఉరుకులు-పరుగులు, ఆలస్యమైందని వేడుకోళ్లు, తల్లిదండ్రుల అభ్యర్థనలు లేకుండా శనివారం జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమన్న నిబంధనకు అనుగుణంగా విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 8.30 గంటలకే చేరుకున్నారు. మొదటి రోజు మదనపల్లె డివిజన్‌లోని 13 మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిసరాల్లో 144సెక్షన్ అమలు చేశారు.

మదనపల్లె డివిజన్‌లో జూనియర్ ఇంటర్ మొదటి రోజు లాంగ్వేజ్(మాతృభాష) తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఒకేషనల్ సబ్జెక్టుల పరీక్షలు సజావుగా జరిగాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు నిర్వహించారు. డివిజన్‌లోని 18 కేంద్రాల్లో ఎవరూ డిబార్ కాలేదని జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈఓ) కృష్ణయ్య తెలిపారు. పెద్దమండ్యం మండలం కలిచెర్ల పరీక్ష కేంద్రంలో 271 మంది విద్యార్థులకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ గోపాల్, డీఓ వెంకటరమణరెడ్డి తెలిపారు. పీలేరు మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 1171 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1109 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని నియమించారు. గుర్రంకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో 178 మంది విద్యార్థులకు 174 మంది హాజరయ్యారు. కలకడ పరీక్ష కేంద్రంలో 412 మంది విద్యార్థులకు 397 మంది హాజరయ్యారు. తంబళ్లపల్లె పరీక్ష కేంద్రంలో 154 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 146 మంది హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రామాంజనేయ ప్రసాద్, డీఓ శ్రీనివాసులు తెలిపారు. రామసముద్రం మండల పరీక్ష కేంద్రంలో 207మంది విద్యార్థులకు 200మంది హాజరయ్యారు.

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన



ఖైదీల గదిని చూపిస్తున్న సీఐ లక్ష్మన్న

ములకలచెరువు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం సీఐ లక్ష్మన్న పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, లాకప్, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం

నిమ్మనపల్లి మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సమాజంపై అవగాహన కలిగి వుండాలని ఎస్ఐ తిప్పేస్వామి సూచించారు. మహిళాదినోత్సవం పురస్కరించుకుని ఓపెన్ హౌస్ నిర్వహించారు. బాల్యవివాహాలు చేసుకోవడం వలన వారికి వచ్చే అనర్థాలపై, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై పిల్లలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలపై, సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



చర్చి పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు జాన్‌బాబు

మదనపల్లె టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జెరూసలేం యాత్ర కోసం క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయించడం హర్షనీయమని గ్లోరీ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని కెథడ్రల్ చర్చిలో పాస్టర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ ఇది వరకే ప్రభుత్వం క్రిస్టియన్ కార్పొరేషన్‌కు రూ.486 కోట్లు కేటాయించిందని, ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్‌లో జెరూసలేం యాత్రకు రూ.1.50 కోట్లు కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వానికి క్రైస్తవులు రుణపడి వుంటారన్నారు. చర్చిపాస్టర్లు దేవమణి, దివాకర్, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

తంబళ్లపల్లె, మా ర్చి (ఆంధ్రజ్యో తి)1: గర్భధారణ, లింగ నిర్ధారణ పరీక్షలు చేయ డం చట్టరీత్యా నేరమని అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి, ఉమ పేర్కొన్నారు. శనివారం స్థానిక అంగన్వాడీ కేంద్రం వద్ద చిన్నారులతో కలసి ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ లిం గ వివక్ష, బాల్య వివాహల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్లు కవిత, సరస్వతి పాల్గొన్నారు.

వరుసగా ఏడు దుకాణాల్లో చోరీ

కురబలకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంగళ్లులో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానిక కడప రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఏడు దుకాణాల్లో చోరీ జరగడంతో కలకలం రేగింది. ఈ చోరీలో రూ.2.50 లక్షల సామగ్రి, నగదు దోచుకెళ్లారు. ప్రతి షాపునకు పైనున్న రేకులను కట్ చోరీ చేయడం విశేషం. అర్థరాత్రి చోరీజరగడం సంచలనంగా మారింది. పోలీసులు క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులతో ఆధారలు సేకరించారు. ఒక షాపులో నమోదైన సీసీ కెమెరా ఫుటేజీ ఇద్దరు యువకులు చోరీ చేసినట్లు తెలుస్తోంది.

'ఇళ్లను కూల్చివేయొద్దు'

మదనపల్లె టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయొద్దని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్ విన్నవించారు. సబ్‌కలెక్టరేట్‌లో ఆర్‌ఐకు వినతి పత్రం ఇచ్చారు. సీటీఎం వాసి ఎంపీపీ ఇ.రెడ్డెమ్మ, ఇ.గంగులమ్మకు సీటీఎం క్రాస్‌రోడ్డులో మంజూరు చేసిన పట్టాలో ఇండ్లు నిర్మించుకుని, పన్ను, విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నారన్నారు. వీరి ఇళ్లను కూల్చివేస్తామని బెదిరిస్తున్నారన్నారు. మాలమహానాడు నేతలు మోహన్, చంద్రయ్య, రామచంద్ర పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే పెద్దపీట



పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ములకలచెరువు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. ములకలచెరువులోని రాజీవ్ కాలనీలో శనివారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు మహిళా కార్యదర్శి గంగాదేవి, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు భజంత్రీ రామాంజులు, నాయకులు పాల రాము, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


'పోసాని అరెస్టుకు మద్దతు పలకడం సిగ్గుచేటు'

మదనపల్లె అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): బూతు పురాణం పోసాని మురళీ కృష్ణ అరెస్టుకు మద్దతుగా నిలిచిన మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిషార్ అహ్మద్ మాటతీరు సిగ్గుచేటని మదనప ల్లె జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు ఎద్దేవా చేశారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంటి మహిళలపై సభ్య సమాజం సిగ్గుపేడేలా అసభ్యకర వాఖ్య లు చేసిన ప్రముఖ సినీనటుడు, నిర్మాత, రచయిత పోసాని సమాజానికి ఇస్తున్న సందేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బూతులు మాట్లాడటమే మీ పార్టీ భావాజాలమా, ఇలాంటి వారికి మద్దుతు పలకడం మీ సిద్ధాంతమా, మద్యం మత్తులో నోటికి వచ్చినట్లు వాగేసి అధికారం పోయాక నేను రాజకీయాల నుంచి తప్పకుంటున్నానంటే వదిలేయాలా అన్ని ప్రశ్నించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు నాయిని జగదీష్, కార్యదర్శి అర్జున, టీడీపీ నేత పసుపులేటి వినోద్‌కుమార్, నేతలు సోమశేఖర్, లిలకర్, డిష్ చంద్ర, సోను, నవాజ్, యాసిన్, ఉమా,సత్య, దినకర్ చౌదరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి రక్షణ కోసం చర్యలు శూన్యం

మదనపల్లె అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మాస్పత్రిని ప్రైవేట్ పరం కాకుండా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇచ్చిన హామీ ఏమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రశ్నించారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలు శూన్యమని, మెడికల్ కాలేజీని ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించాలనే కూటమి ప్రభుత్వం చర్యలు అర్థరహితమన్నారు. సీపీఎం దీక్షలకు వచ్చిన ఎమ్మెల్యే షాజహాన్ నెలరోజుల్లో ఖాళీ డాక్టర్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని, స్టాఫ్ నర్సుల బదిలీలు కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. హామీలు నెరవేర్చకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

మాస్టరింగ్ క్లౌడ్ అండ్ దేవోప్స్ టూల్స్ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజనీర్ ప్రకాష్

కురబలకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో మాస్టరింగ్ క్లౌడ్ అండ్ దేవోప్స్ టూల్స్ కీలకమని సీనియర్ ఇంజనీర్ ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మాస్టరింగ్ క్లౌడ్ అండ్ దేవోప్స్ టూల్స్' అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చన్నారు. సాంకేతిక పరంగా జరుగుతున్న విప్లవాత్మక మార్పులకు తోడు సమస్యలు ఎదురవుతున్నాయని వాటికి తగ్గట్టు చర్యలు చేపట్టాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి చొక్కానాథమ్, కో ఆర్డినేటర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీలగిరిచెట్ల వేలం

నిమ్మనపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం గ్రామం కోమిటివాని చెరువులో వున్న నీలగిరి చెట్ల వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి గౌతమి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 5వతేదీ బుధవారం పంచాయతీ కార్యాలయంలో కోమిటివానిచెరువులో వున్న 600 నీలగిరి చెట్లకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ముందుగా రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన వచ్చని తెలిపారు.

బండకింద తండాలో తాగునీటి సమస్య

పెద్దమండ్యం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రామానాయక్ తండా పంచాయతీ బండకింద తండాలో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు. తండా వాసులు మాట్లాడుతూ బండకింద తండాలో సగం గ్రామానికి తాగునీటి పథకం బోరునీళ్లు వస్తాయని, మిగిలిన సగం గ్రామానికి నీరు అందడం లేదన్నారు. వేసవి ముందుగానే గ్రామంలో తాగునీటి సమస్య వచ్చింది సకాలంలో అధికారులు స్పందించి పరిష్కరించాలని నవోదయం కార్యక్రమంలో వారు కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాడుతున్న నలుగురిని పట్టుకుని వారి నుంచి రూ.3830లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. తవళం పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలో చింత చెట్టుకింద మంగతాయి ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడులు చేసి నలుగురిని పట్టుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పెద్దమండ్యం ఆర్ఐగా సయ్యద్ ఇమ్రాన్



పెద్దమండ్యం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం ఆర్ఐగా సయ్యద్ ఇమ్రాన్ బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ వెల్లడించారు. రామసముద్రం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఆర్ఐగా పదోన్నతిని కల్పిస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ నియామకం ఆదేశాలు జారీ చేశారు.

టీకాలు వేయించాలి

నిమ్మనపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పాడిరైతులు గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించాలని పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మార్చి 1 నుంచి 31వరకు దాదాపు 30రోజులు గాలికుంటు వ్యాధికి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మొత్తం 12500 డోసులు వచ్చాయని వీటిని అన్ని గ్రామాల్లో పాడి పశువులకు వేయనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

పీలేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రమజాన్ మాసపు తాకిడిని దృష్టిలో పెట్టుకుని మసీదుల్లో పారిశుద్యం మెరుగుపరచాలని తెలుగు యువత అధ్యక్షుడు నల్లారి రియాజ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పీలేరు శానిటరీ అధికారి నౌషాద్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ రమజాన్ కారణంగా మసీదుల్లో రద్దీ పెరుగుతుందని, సెహరీ, ఇఫ్తారీలతో పరిశుభ్రత దెబ్బతింటుందని, ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు.